నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

సూర్య 18వ వసంతంలోకి...
visit us @ http://epaper.suryaa.com

శనివారం | 21 సెప్టెంబర్ 2024 | హైదరాబాద్

సంపుటి 17 | సంచిక 291
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - వర్ష ఋతువు, భాద్రపద మాసం బ. చవితి రా.11.21, అశ్వని ఉ.8.02, వర్జ్యం సా.5.03 నుంచి 6.30 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.7.22 వరకు

# లడ్డు రగడ

## తిరుమల లడ్డూ కల్తీపై తీవ్రంగా పరిగణించిన కేంద్రం

- శ్రీవారి లడ్డూ కల్తీపై సమగ్ర నివేదక ఇవ్వండి
- ఏపీ సీఎం చంద్రబాబును కోరిన కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా
- ఈ విషయంలో రాష్ట్రానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుంది
- ఫుడ్ సేఫ్టీ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం
- ప్రసాదం ప్రకంపనలు
- బాధపడుతున్న భక్తుల మనోభావాలు
- సీఎం చంద్రబాబు సమీక్ష
- డిఫెన్స్‌లో జగన్
- కోర్టును ఆశ్రయించిన వైసీపీ



2లో

తిరుమల ప్రసాదం ప్రకంపనలు కలిగిస్తోంది. ప్రసాదంలో వాడుతున్న నెయ్యిలో కల్తీ జరిగిందంటూ వస్తున్న ఆరోపణలపై భక్తులు, ధార్మిక పరిషత్ ల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. దీనిలో వాస్తవాల అంశం ఎలా ఉన్నా, గత ప్రభుత్వం, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డిఫెన్స్‌లో పడిపోయారు.

### వెంటనే కులగణన
# చేపట్టాలి



7లో

- స్థానిక సంస్థల కోటాలో 42% రిజర్వేషన్లను పెంచాలి
- గత మూడేళ్లుగా పెండింగ్‌లోని ఫీజు బకాయిలు విడుదల చేయాలి
- బీసీ సంఘాల నిరసనలో బీసీ నేత ఆర్.కృష్ణయ్య

### సుప్రీం యూట్యూబ్
# ఛానల్ హ్యాక్



6లో

- తెగబడిన సైబర్ కేటుగాళ్లు
- ఛానల్ పేజీలో క్రిప్టో కరెన్సీ ప్రమోషన్ వీడియోలు
- సుప్రీంకోర్టు విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న ఛానల్
- శుక్రవారం ఉదయం నుంచి మొదలైన సమస్య

### పెద్ద అవినీతి పార్టీ
# కాంగ్రెస్

- కాంగ్రెస్‌లో ద్వేషం అనే దెయ్యం ప్రవేశించింది
- ఇప్పుడున్నది గతంలోని కాంగ్రెస్ కాదు..కాంగ్రెస్ అంటేనే అబద్ధం, మోసం
- ఆ పార్టీలో దేశ భక్తి, స్ఫూర్తి తుడిచిపెట్టుకుపోయాయి
- అర్బన్ నక్సల్స్, తుక్డే తుక్డే గ్యాంగ్ కాంగ్రెస్‌ను నడిపిస్తున్నాయి
- కాంగ్రెస్ చేస్తున్న పాపాలకు తగిన బుద్ధి చెప్పాలి
- మహారాష్ట్రలోని వార్ధాలో ప్రధాని మోడీ పిలుపు

కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోడీ నిప్పులు చెరిగారు. మహారాష్ట్రలోని వార్ధాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. అర్బన్ నక్సల్స్, తుక్డే తుక్డే గ్యాంగ్ కాంగ్రెస్‌ను నడిపిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పుడున్నది గతంలోని కాంగ్రెస్ కాదని, ఆ పార్టీలో దేశభక్తి, స్ఫూర్తి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని అన్నారు.



6లో

## నేడే శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు

- ఎన్నికల బరిలో 38 మంది అభ్యర్థులు
- 13 వేల పోలింగ్ కేంద్రాలు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 1.7 కోట్ల మంది
- 1982 తర్వాత త్రిముఖ పోటీ ఇదే తొలిసారి



6లో

## లాభాల్లో స్టాక్ మార్కెట్లు



5లో

- 1,359 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- తొలిసారి 84 వేల మార్కును అధిగమించిన సెన్సెక్స్
- 84,544 పాయింట్లకు పెరిగిన సెన్సెక్స్

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### నక్సలైట్లకు అమిత్ షా
# డెడ్ లైన్

- మావోయిస్టులు ఆయుధాలను వదిలేసి లొంగిపోవాలి
- లేదంటే ఆపరేషన్ నిర్వహించి ఏరిపడేస్తాం
- 2026 మార్చి నాటికి నక్సలిజం అంతం చేస్తాం
- బాధితుల కోసం త్వరలోనే సంక్షేమ పథకం
- కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా

ఇటీవల ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టుల దాడులు పెరిగిపోతున్నాయి. ఈనేపథ్యంలో 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.



6లో

## హైడ్రాకు విస్తృత అధికారాలు

- తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు
- హకీంపేటలో జూనియర్ కళాశాల ఏర్పాటు
- కొస్గిలో ఇంజనీరింగ్ కళాశాల
- సన్న బియ్యం సైతం సరఫరా
- మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలు



2లో

## సీఎం రేవంత్ రెడ్డికి భారీ ఊరట



3లో

- ఓటుకు నోటు కేసులో సుప్రీం కీలక నిర్ణయం
- ఈ కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయబోమని న్యాయస్థానం స్పష్టం

### కష్టాన్ని నమ్ముకుని.. మంత్రిగా
# సేవలందిస్తున్నా

- మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది
- తెలంగాణ 10వ వార్షిక లీడర్‌షిప్ సదస్సును ప్రారంభించిన సీతక్క

ఎవరి మీద ఆధారపడకుండా కష్టాన్ని నమ్ముకున్నా. మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యి మంత్రిగా సేవలందిస్తున్న అని మంత్రి సీతక్క అన్నారు. మాదాపూర్ లోని టెక్ మహీంద్రా క్యాంపస్ లో సీఐఐ ఇండియన్ వుమెన్ నెట్‌వర్క్ తెలంగాణ 10వ వార్షిక లీడర్‌షిప్ సదస్సును సీతక్క ప్రారంభించారు.



7లో

## సీబీఐ విచారణ జరిపించండి



- శ్రీవారి ప్రసాదం వివాదంపై ఆందోళన
- ఏపీ సీఎంకు బండి సంజయ్ లేఖ

వివరాలు-7లో

## అంతా ఇంతే!



పక్కింటి వారు తిరుపతి లడ్డూ ప్రసాదం ఇచ్చారండీ

# సింగరేణి కార్మికులకు బోనస్

## దసరాకు ముందే కార్మికుల కుటుంబాల్లో పండగ

- కార్మిక కుటుంబాలకు అందనున్న రూ.796 కోట్లు
- ఒక్కో కార్మికునికి రూ.1.90 లక్షలు
- తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకూ రూ.5 వేలు అందజేత
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



3లో

సింగరేణి కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీపి కబురు అందించారు. సింగరేణి కార్మిక కుటుంబాల్లో ఆనందం నింపడమే లక్ష్యంగా దసరాకు ముందే బోనస్ ప్రకటించారు. గతేడాది సింగరేణి సంస్థ ఉత్పత్తి, గడించిన లాభాల ఆధారంగా బోనస్సు ప్రకటించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఒక్కో కార్మికునికి రూ.1.90 లక్షలు, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేలు చొప్పున బోనస్ ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రక్రియలో సింగరేణి కార్మికులు అగ్రభాగాన నిలిచారని, ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లడంతో గని కార్మికుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి కొనియాడారు. అనంతరం సింగరేణి లాభాలు, విస్తరణ.. బోనస్కు సంబంధించిన వివరాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విలేకరులకు వివరించారు.

### దేశంలో తెల్లరేషన్ కార్డుల
# సంఖ్య తగ్గాలి



3లో

- ఉచితాలు వద్దు మేం బ్రతకగలం అనే స్థాయి ప్రజల్లో రావాలి
- దేశం అటువైపు వెళ్ళాలి.. ప్రజలు వారి కాళ్ళ మీద బ్రతికే దిశగా ఎదగాలి
- పీఎం విశ్వకర్మ మొదటి వార్షికోత్సవ సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్
- విద్యానగర్‌లో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్
- ఎంపీ ఈటల

### అది ఫోర్త్ సిటీ కాదు
# అది ఫోర్ బ్రదర్స్



7లో

- రేవంత్ సర్కార్ పేదల భూములపై కన్నేసింది
- ఫోర్త్ సిటీ మాటున వేల ఎకరాలు గుంజుకునేందుకు కసరత్తు మొదలు పెట్టింది
- అడ్డగోలు అలైన్‌మెంట్‌తో... పేదల అనుమతి లేకుండా... వారి భూములను స్వాధీనం చేసుకునేందుకు కుట్ర
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా

సూర్య
హైదరాబాద్
శనివారం
21 సెప్టెంబర్ 2024


# ప్రసాదంలో జంతువుల కొవ్వు వినియోగం ఆందోళన కలిగిస్తోంది

● హిందూ సమాజం మనోభావాలను తీవ్రంగా కలచివేస్తోందన్న బండి సంజయ్ ● లడ్డూ వ్యవహారంలో తిరుమల పవిత్రతను దెబ్బతీశారని ఆందోళన

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయమై ఏపీ సీఎం చంద్రబాబుకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు వినియోగం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ఇది క్షమించరాని నేరం అన్నారు. ఈ అంశంపై సీబీఐ విచారణ కోరాలన్నారు. ఈ లడ్డూ ప్రసాదం వ్యవహారం శ్రీవారి భక్తకోటిని, యావత్ హిందూ సమాజం మనోభావాలను తీవ్రంగా కలచివేస్తోందన్నారు. లడ్డూ వ్యవహారంలో తిరుమల పవిత్రతను దెబ్బతీశారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్యమత ప్రచారం జరుగుతోందని గతంలో ఫిర్యాదులు వచ్చినప్పటికీ నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు. ఎర్రచందనం కొల్లగొడుతూ ఏడు కొండలవాడిని రెండు కొండలకే పరిమితం చేశారని చెప్పినా స్పందించలేదన్నారు. జంతువుల కొవ్వును లడ్డూ ప్రసాదంలో వినియోగించారని మీరు చేసిన వ్యాఖ్యలతో కల్తీ జరిగినట్లుగా హిందూ సమాజం భావిస్తోందన్నారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును వినియోగించడం అత్యంత నీచమని, దీనిని హిందూ ధర్మంపై జరిగిన భారీ కుట్రగా భావిస్తున్నామని పేర్కొన్నారు. లడ్డూ ప్రాముఖ్యతను తగ్గించడం ద్వారా టీటీడీపై కోట్లాది మంది భక్తుల విశ్వాసాన్ని సడలించేందుకు కుట్ర చేశారన్నారు. ఇది క్షమించరాని నేరం అన్నారు. అన్యమతస్తులకు టీటీడీ బాధ్యతలు అప్పగించడం, ఉద్యోగాల్లో అవకాశం కల్పించడం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. ఉన్నతస్థాయి వ్యక్తుల ప్రమేయం లేకుండా ఏళ్లుగా కల్తీ దందా జరిగే అవకాశం ఉండదన్నారు. సీబీఐతో విచారణ జరిపిస్తే నిజాలు నిగ్గు తేలుతాయని, అయితే అంతిమ నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టి హిందువుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.



# హైడ్రాకు విస్తృత అధికారాలు

● తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు ● హకీంపేటలో జూనియర్ కళాశాల ఏర్పాటు ● కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాల ● 72 ఎకరాలలో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు ● అక్టోబర్ రెండు నుండి వైట్ రేషన్ కార్డులు మంజూరు ● సన్న బియ్యం సైతం సరఫరా ● మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గం సమావేశమైంది. ఈ భేటీలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భేటీ అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. విమర్శకుల నోళ్ళని రేవంత్ రెడ్డి క్యాబినెట్ మూయించేసింది. ఏ విషయంలో అంటే హైడ్రాకు చట్టబద్దత కల్పించటం ద్వారా. చెరువులు, కాల్వలు, కుంటల ఆక్రమణలను తొలగించటం, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ఆయా శాఖలకు అప్పగించటంతో



పాటు మళ్ళీ ఆక్రమణలు జరగకుండా జలవనరులను కాపాడటమే హైడ్రా ముఖ్య ఉద్దేశ్యం. అందుకనే ఉత్తర్వులు జారీచేయటం ద్వారా హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. హైడ్రాను ఉత్తర్వాల ద్వారా ఏర్పాటైతే చేసింది కాని చట్టబద్దతను చాలామంది ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో హైడ్రాకు చట్టబద్దత కల్పిస్తు తీర్మానం జరిగింది. క్యాబినెట్ తీర్మానం అయినంత మాత్రాన హైడ్రాకు చట్టబద్దత వచ్చినట్లు కాదు. అయితే చట్టబద్దత ఇవ్వటానికి క్యాబినెట్ నిర్ణయం చాలా అవసరం. క్యాబినెట్ నిర్ణయం జరిగింది కాబట్టి తొందరలోనే జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టి పాస్ చేయించి తర్వాత గవర్నర్ ఆమోదం తీసుకోవాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. ఒకవేళ సమావేశాల నిర్వహణ ఆలస్యమైతే ఆర్డినెన్స్ జారీచేయటం ద్వారా హైడ్రాకు గవర్నర్ ఆమోదం పొందాలనే ఆలోచనలో ఉంది. ఏదేమైనా తొందరలోనే హైడ్రాకు చట్టబద్దత రావటం ఖాయం. ఎందుకంటే హైడ్రాపై ప్రభుత్వం చాలా కీలకమైన బాధ్యతలను మోపబోతోంది. మూసీ నది ప్రక్షాళన, చెరువులు, కాల్వలతో పాటు కుంటలను ఆక్రమించిన మరిన్ని నిర్మాణాలను తొలగించటం లాంటి చాలా బాధ్యతలు హైడ్రాకు ఉన్నాయి. ఇవన్నీ జరగాలంటే వీలైనంత తొందరలోనే హైడ్రాకు చట్టబద్దత రావాలి. హైడ్రాకు చట్టబద్దత నిర్ణయం తీసుకోవటంతో పాటు 169 మంది సిబ్బందిని ఇవ్వాలని కూడా డిసైడ్ చేసింది. ఇప్పటికే హైడ్రాకు 359 మంది సిబ్బంది ఉన్న విషయం తెలిసిందే. ఎలాగూ హైడ్రాకు చట్టబద్దత ఇస్తు నిర్ణయం జరిగిపోయింది కాబట్టి దాని విధివిధనాలపైన కూడా తొందరలోనే ప్రభుత్వం ప్రకటన చేయబోతోంది. హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ ఉండేలా నిబంధనలు



సడలించాం. హైడ్రాకు అవసరమైన సిబ్బందిని వివిధ విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై రప్పిస్తున్నాం. 169 మంది అధికారులు, 964 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కేటాయింపు ఓఆర్ఆర్ లోపల 27 అర్బన్, లోకల్ బాడీలు ఉన్నాయి. 51 గ్రామ పంచాయతీలను కోర్ అర్బన్‌లో విలీనం. ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్ ఖరారుకు కమిటీ ఏర్పాటు. ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో 12 మందితో కమిటీ. కమిటీ కన్వీనర్‌గా ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ.

**పోలీసు-ఆరోగ్య భద్రత స్కీమ్ ఎస్‌పీఎల్‌కు కూడా వర్తింపు.**

మనోహరాబాద్‌లో 72 ఎకరాల్లో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు ఆమోదం. 8 వైద్య కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకం. 3వేలకు పైగా పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్. ఖమ్మం జిల్లాలో 58 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఆమోదం.

ఏటూరునాగారం ఫైర్ స్టేషన్‌కు 34 మంది సిబ్బంది మంజూరు. కోస్గిలో ఇంజినీరింగ్ కళాశాల, హకీంపేటలో జూనియర్ కళాశాల మంజూరు. ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ పనులకు రూ.4,637 కోట్లు మంజూరు. రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని ఏజెన్సీకి ఆదేశం. ఈ ఖరీఫ్ నుంచి ఎంఎస్‌పీకి అదనంగా రూ.500 చెల్లించి సన్నాలు కొనుగోలు చేయాలని నిర్ణయం. ఈ ఖరీఫ్‌లో 1.43లక్షల టన్నుల పంట వస్తుందని అంచనా. అక్టోబరు నుంచి కొత్తగా తెల్ల రేషన్ కార్డుల జారీ. జనవరి నుంచి అన్ని రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం ఇస్తాం అని మంత్రులు స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

● పలు ప్రాంతాలు జలమయం



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: భాగ్యనగరంలో వర్షం పడుతోంది. సిటీలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కాగా, హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. ఉప్పల్, బోడుప్పల్, పీర్జాదిగూడల, నాగోల్, హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్, చైతన్యపురి, కొత్తపేట, సరూర్‌నగర్, అంబర్‌పేట్, రామంతపూర్, గోల్నాక, నారాయణగూడ వర్షం పడుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు కాలనీల్లో అంధకారం నెలకొంది. ట్రాఫిక్ స్తంభిచడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.

**జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం...**

జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. ఆసిఫాబాద్ మండ లంలో ఓ మోస్తరు వర్షం కురియగా కాగజ్‌నగర్‌లో భారీవర్షం కురిసింది. అలాగే కౌటాల, కెరమెరి, సిర్పూర్(టి), దహెగాం, వాంకిడి, పెంచికలపేట, చింతలమానేపల్లి మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో పత్తిరైతులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరింది. అలాగే అంతర్గత రోడ్లు బురదమయం అయ్యాయి. ఉదయం నుంచి ఎండవేడిమితో ఇబ్బందులు పడిన పట్టణవాసులు ఈ వర్షంతో ఉపశమనం పొందారు.

# స్వామివారి లడ్డు కల్తీదారులపై చర్యలు తీసుకోవాలి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ప్రపంచవ్యాప్తంగా పేరుందిన తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి మహా ప్రసాదం లడ్డులో కల్తీ కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యదర్శి చెన్నమనేని స్రవంతి డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని, హిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన గత ప్రభుత్వ హాయంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గత ప్రభుత్వ హాయంలో తిరుమల తిరుపతి బోర్డ్ ఛైర్మన్‌గా వ్యవహరించిన వైవి సుబ్బారెడ్డి హయంలో తిరుపతి లడ్డులో నెయ్యికి బదులు జంతువుల (పంది) కొవ్వులను పవిత్ర ప్రసాదంలో కలిపిన విషయం బయటపడిందని ఇది విశ్వవ్యాప్తమైన పరిస్థితుల్లో హిందువుల మనోభావాలు దెబ్బ తిన్నాయన్నారు. అంతేకాక తిరుపతి పవిత్రత కోల్పోవడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. గుజరాత్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత ల్యాబొరేటరీ ఎన్‌డీడీబీ కాఫ్ ల్యాబ్ నుంచి వచ్చిన ఫలితాలే ఇందుకు నిదర్శనమని ఆరోపించారు. ఇది వందమంది కోట్లాది శ్రీవారి భక్తుల మనోభావాల్ని దెబ్బతీయడం కాదా అని ప్రశ్నించారు. జంతువుల కొవ్వును లడ్డూ ప్రసాదంలో వినియోగించారని మీరు చేసిన వ్యాఖ్యలతో కల్తీ జరిగినట్లుగా హిందూ సమాజం భావిస్తోందన్నారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును వినియోగించడం అత్యంత నీచమని, దీనిని హిందూ ధర్మంపై జరిగిన భారీ కుట్రగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

లడ్డూ ప్రాముఖ్యతను తగ్గించడం ద్వారా టీటీడీపై కోట్లాది మంది భక్తుల విశ్వాసాన్ని సడలించేందుకు కుట్ర చేశారన్నారు. ఇది క్షమించరాని నేరం అన్నారు. అన్యమతస్తులకు టీటీడీ బాధ్యతలు అప్పగించడం, ఉద్యోగాల్లో అవకాశం కల్పించడం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు.శ్రీమంతులు పేదలు అనే తారతమ్యం లేకుండా భక్తులు గంటల తరబడి నిలబడి శ్రీవారిని దర్శనం చేసుకుని, ప్రసాదం కోసం క్యూ లైన్ లో నిలబడి ప్రసాదాన్ని అతి పవిత్రంగా పరిగణిస్తారన్నారు. అయితే తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ ఆరోపణలపై దర్యాప్తు అవసరమని గుర్తు చేశారు.

ఈ విషయమై భారత ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు లు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశం చాలా తీవ్రమైందని, దీనిపై సమగ్రంగా విచారణ జరిపి దోషులుగా తేలిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

# దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌పై హైకోర్టులో విచారణ

● రెవెన్యూ, నీటిపారుదల శాఖలతో పాటు హెచ్ఎండీకే హైకోర్టు నోటీసులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై తెలంగాణ హైకోర్టులో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిపింది. హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. చెరువు ఎఫ్‌టీఎల్ 160 ఎకరాలుగా పేర్కొనడంపై ప్రియతంరెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. గత రికార్డుల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధి కేవలం 65 ఎకరాలుగా మాత్రమే ఉందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. పిటిషన్‌పై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. అయితే, ఈ విషయంలో వివరణ ఇవ్వాలంటూ రెవెన్యూ, నీటిపారుదలశాఖలతో పాటు హెచ్ఎండీకే హైకోర్టు నోటీసులు జారీ చేసింది. హెచ్ఎండీఏ పరిధిలోని వివిధ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో చేపట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలు నిర్మాణాలను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే.

# షీటీమ్స్‌కు దొరకిన 996 మంది ఈవ్ టీజర్లు



● గణేష్ ఉత్సవాల్లో చెలరేగిపోయిన ఈవ్‌టీజర్లు ● గణేష్ మండపాల వద్ద అమ్మాయిల పట్ల ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తన ● పలు వీడియోల ద్వారా వ్యవహారాలు బట్టబయలు ● పలువురు ఈవ్ టీజర్లకు షీ టీమ్స్ కౌన్సెలింగ్ ● డయల్ 100 లేదా 9490616555లో వాట్సాప్‌లతో షీ టీమ్స్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచనలు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహం వినాయకుడిని దర్శించుకునేందుకు అత్యంత ప్రపత్తులతో వచ్చిన యువతుల భుజాలు, తాకరాని చోట తాకుతూ కొందరు యువకులు వేధించారు. యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండగా షీ టీమ్ పోలీసులు దాన్ని వీడియో రికార్డు చేశారు.ఓ మధ్య వయస్కుడు ఓ మహిళ వెనుక క్యూలో నిలబడి తాకరాని చోట తాకుతూ చేతులతో పట్టుకున్నాడని షీ టీమ్ వీడియోలో వెల్లడైంది. ఓ యువకుడు ఓ అమ్మాయి వక్షోజాలను తాకుతూ పోయాడు. మరో యువకుడు అమ్మాయి నడుము పట్టుకున్నాడు.మరో యువకుడు చేత్తో అమ్మాయిలను తాకుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. మహిళలు, యువతులపై ఈవ్ టీజర్ల వేధింపులను షీ టీమ్స్ వీడియో సాక్ష్యాధారాలతో పట్టుకుంది. షీ టీమ్స్ విడుదల చేసిన నాలుగు వీడియోలు చూస్తే షాకవ్వాల్సిందే. దీనిలో ఈవ్ టీజర్ల బాగోతం బట్టబయలైంది. 996 మంది ఈవ్ టీజర్లపై కేసులు హైదరాబాద్ నగరంలో కోలాహలంగా జరిగిన గణేష్ ఉత్సవాల్లో అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఈవ్ టీజర్లపై షీ టీమ్స్ కొరడా ఝుళిపించింది. 11 రోజుల పాటు అత్యంత భక్తిప్రపత్తులతో సాగిన ఉత్సవాలు, నిమజ్జనోత్సవంలో ఈవ్ టీజర్లు అమ్మాయిలను అసభ్యంగా తాకారని షీ టీమ్స్ తీసిన వీడియోల్లో తేలింది. హైదరాబాద్ నగరంలో 996 మంది ఈవ్ టీజర్లు ఈ ఏడాది రెడ్ హ్యాండెడ్‌గా షీ టీమ్‌లకు దొరికారు.

**షీటీమ్స్ వీడియో సాక్ష్యాలు**

గణేష్ చతుర్థి ప్రధాన పండుగ. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నలుమూలలా ఏర్పాటైన పలు విభిన్న విగ్రహాలు, ఖైరతాబాద్ బడా గణేష్ దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షించింది. ఈ గణేష్ ఉత్సవం సందర్భంగా తెలంగాణ షీ టీమ్స్ హైదరాబాద్‌లో 11 రోజుల వ్యవధిలో 996 మంది ఈవ్ టీజర్లను పట్టుకోవడం సంచలనం రేపింది. ఈవ్ టీజర్ల ఆగడాలపై వీడియో సాక్ష్యాలున్నాయి.

**ఖైరతాబాద్ బడా గణేష్ వద్ద...**

నగరంలోని ఖైరతాబాద్ బడా గణేష్ మండపం వద్ద, ఇతర రద్దీ ప్రాంతాల్లో మహిళా భక్తులతో ఈవ్ టీజర్లు అసభ్యంగా ప్రవర్తించారు. ఈవ్ టీజర్లు అమ్మాయిలను తాకుతూ వీడియో/ఫోటో ఆధారాలతో బహిరంగ ప్రదేశాల్లో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ చట్టంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.వీడియో ఆధారాలతో దొరికిన వారిపై కేసులు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పర్చారు. సీపీ చట్టం సెక్షన్ 70(సీ), 292 బీఎన్ఎస్ కింద ఈవ్ టీజర్లపై పెట్టీ కేసులు నమోదు చేశారు. ఈవ్ టీజర్లకు షీ టీమ్స్ కౌన్సెలింగ్ ఈవ్ టీజర్లను సాక్ష్యాధారాలతో పాటు మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చారు. కొన్ని సందర్భాల్లో వీడియో సాక్ష్యం దొరకని సందర్భాల్లో అటువంటి వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.గణేష్ పండుగ సందర్భంగా మహిళల భద్రత కోసం షీ టీమ్‌లు రౌండ్-ది-క్లాక్ పనిచేశాయి. షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయండి "మీరు ఏదైనా అనుచిత ప్రవర్తనను చూసినట్లయితే, ప్రశాంతంగా ఉండకండి మీ వాయిస్‌ని పెంచండి,వెంటనే షీ టీమ్‌లకు నివేదించండి లేదా 100కి డయల్ చేయండి. షీ టీమ్స్ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుంది. బహిరంగ ప్రదేశాల్లో, రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఇలాంటి సంఘటనలు, అసభ్యకర చర్యలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి" అని షీ టీమ్స్ డిప్యూటీ కమిషనర్ కోరారు.లేచి నిలబడండి, మాట్లాడండి మరియు హైదరాబాద్‌ను సురక్షితమైన నగరంగా ఉంచడానికి షీ టీమ్‌లు నిరంతరం పనిచేస్తాయని తెలుసుకోండి.సహాయం కోసం లేదా సంఘటనలను నివేదించడానికి, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా 9490616555లో వాట్సాప్ ద్వారా షీ టీమ్స్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని మహిళల భద్రత పోలీసు కమిషనర్ సూచించారు.

## తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో క్యూఆర్ కోడ్ చెల్లింపులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి:త్వరలో టీజీఎస్ఆర్టీసీ బస్సులో అందుబాటులోకి డిజిటల్ పేమెంట్స్ టికెట్ కొనుగోలు చేసే సమయంలో చిల్లర విషయంలో తలెత్తే సమస్యకు ఇకపై చెక్ పైలెట్ ప్రాజెక్టుగా ఇప్పటికే బండ్లగూడ, దిల్‌సుఖ్‌నగర్ డిపోల్లో డిజిటల్ చెల్లింపులు జరగనున్నాయి.ఈ ప్రయోగం విజయవంతం కావడంతో అన్ని ఆర్టీసీ బస్సుల్లో డిజిటల్ పేమెంట్స్ కు నిర్ణయంటీజీఎస్ఆర్టీసీ ప్రయాణికుల కోసం త్వరలో క్యూఆర్ కోడ్ చెల్లింపులను అందుబాటులోకి తేనుంది. తద్వారా టికెట్ కొనుగోలు చేసే సమయంలో చిల్లర విషయంలో తలెత్తే సమస్యకు ఇకపై చెక్ పడనుంది. ఇప్పటికే బండ్లగూడ, దిల్‌సుఖ్‌నగర్ డిపోలోని బస్సుల్లో పైలెట్ ప్రాజెక్టుగా డిజిటల్ పేమెంట్లను అమలు చేయగా, ఆ ప్రయోగం విజయవంతమైంది. దాంతో గూగుల్ పే, ఫోన్‌పే, క్రెడిట్, డెబిట్ కార్డులతో పాటు అన్ని రకాల డిజిటల్ పేమెంట్స్‌ను ఆర్టీసీ బస్సుల్లో అనుమతించాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచన ప్రాయంగా సిబ్బందికి చెప్పినట్లు తెలుస్తోంది. అలాగే ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్లు వినియోగిస్తున్న టిమ్ మిషన్ల స్థానంలో రాష్ట్రవ్యాప్తంగా అందరికీ ఆటోమేటిక్ ఫెయిర్ కలెక్షన్ సిస్టం మిషన్లు ఇవ్వనున్నట్లు సమాచారం.

# జలవిహార్‌పై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: హుస్సేన్ సాగర్‌ను కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేశారని, జలవిహార్ వ్యర్థాలు అన్ని హుస్సేన్ సాగర్‌లోకే అంటూ వస్తున్న ఆరోపణలపై జలవిహార్ డైరెక్టర్ విజయ్ ఆదిత్య రాజు స్పందించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జలవిహార్ పై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని అన్నారు. ప్రభుత్వం ప్రత్యేక జీవో ద్వారా తమకు 12.5 ఎకరాల స్థలానికి కేటాయించిందని.. అందులోనే వాటర్ పార్కును ఏర్పాటు చేశామని వెల్లడించారు.

# ఫిలిప్పీన్స్‌లో రోడ్డు ప్రమాదం

**తెలుగు వైద్య విద్యార్థి దుర్మరణం**


తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఉన్నత చదువుల కోసం ఎంతోమంది భారతీయ విద్యార్థులు విదేశాలకు వెళ్తుంటారు. అయితే అక్కడ బాగా చదువుకొని తమ కలలను సాకారం చేసుకోవాలని అనుకుంటారు. అయితే కొంతమంది ఆశలు కలలుగానే మారుతున్నాయి. తమ తల్లిదండ్రులతో పాటు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుంటారు. చాలామంది జాబ్, చదువు కోసమని వెళ్లి విదేశాల్లో మన భారతీయులు విగతజీవులుగా మారుతున్నారు.కొంతమంది ప్రమాదాల బారీన పడి మరణిస్తుండగా.. మరికొంతమంది హత్యకు గురవుతున్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడం కలచివేస్తుంది. తాజాగా, ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన తెలంగాణకు చెందిన నిజామాబాద్ జిల్లాకు ఓ వైద్య విద్యార్థి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన వైద్య విద్యార్థి అక్షయ్ ఉన్నత చదువుల కోసం ఫిలిప్పీన్స్ దేశం వెళ్లారు. ఎంబీబీఎస్ చదివేందుకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మరో 6 నెలల్లో ఎంబీబీఎస్ పట్టా అందుకుంటానని చెప్పిన కొన్ని రోజులకే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు వాపోయారు. అక్షయ్ బైక్‌పై వెళ్తుండగా..ఎదురుగా రాంగ్ రూట్‌లో గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్షయ్‌కి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్షయ్ మృతితో నిజామాబాద్ జిల్లా వేల్పూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉండగా, సెప్టెంబర్ 15న కెనడా టొరంటోలో బర్త్ డే వేడుకలు చేసుకుంటుండగా చెరువులో పడి ప్రణీత్ మృతి చెందాడు. అయితే ప్రణీత్ మృతదేహాన్ని హైదరాబాద్ తీసుకొచ్చేందుకు ప్రభుత్వాన్ని కోరారు. దీంతో ఈనెల 23న ప్రణీత్ డెడ్ బాడీ హైదరాబాద్ రానుంది. కెనడా నుంచి 22న ఢిల్లీకి చేరుకుంటుదని అధికారులు చెబుతున్నారు.

# ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో తెలుసా?

● తిరుమల లడ్డూ వివాదంపై ● బీజేపీ తెలంగాణ నాయకురాలు మాధవీలత

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: కోట్లాది మంది భక్తులు పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి శ్రీవారి లడ్డూ తయారీలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వును వాడారని టీడీపీ చెప్పిన వివరాలపై బీజేపీ తెలంగాణ నాయకురాలు మాధవీలత స్పందించారు. ఇవాళ ఆమె మీడియాతో మాట్లాడుతూ తిరుపతి లడ్డూ అంశంపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తిరుమల తిరుపతిలో జరిగింది చిన్న విషయం కాదని మాధవి లత అన్నారు. కేవలం లడ్డు పైనే కాకుండా మొత్తం శ్రీవారి ఆస్తులపై విచారణ జరగాలని అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి 100 రోజుల పాలనపై డైవర్షన్ పాలిటిక్స్ కోసమే ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారని జగన్ అంటున్నారని చెప్పారు.మరి జగన్ హయాంలో జరిగిన సంఘటనల గురించి ఏం మాట్లాడుతారని నిలదీశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచి జగన్ వరకు అక్కడ అన్యమతస్తులకు ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. అన్యమతస్తులను ఏడోమెంట్ లో చేర్చడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాతే ఒక్కటిగా బయటకు వస్తున్నాయని చెప్పారు. లడ్డూ అంశంతో వైసీపీ అరాచకలను బయట పెట్టారని అన్నారు. ఇది ఇంతటితో ఆగవద్దని, శ్రీవారి మొత్తం అస్తులపైనా విచారణ జరగాలని చెప్పారు. దానిపై అందరం కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

# తిరుమల శ్రీవారి లడ్డూకే ఎందుకంత రుచి?





తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కలియుగ వైకుంఠంగా పేరొంది, వేదాలే శిలలై వెలసిన కొండ! భక్తజనం ముక్త కంఠంతో ఎలుగెత్తి పిలిచే తిరుమల కొండ! వెంకటేశ్వరుడు వెలిసిన కొండ. ఆ కలియుగ బ్రహ్మాండనాయకుడి దర్శనానంతరం అందరూ ఎంతో భక్తి భావంతో స్వీకరించే ప్రసాదమే 'తిరుమల లడ్డూ'. ఎన్ని లడ్డూలున్నా స్వామివారి లడ్డూ ప్రసాదానికి ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. ఈ లడ్డూ రుచి, సువాసన ఈ భూ ప్రపంచంలో ఏ లడ్డూకు ఉండదంటే అతిశయోక్తి కాదు. మరి అంతటి ప్రాముఖ్యత ఉన్న శ్రీవారి లడ్డూ ప్రసాదం విశేషాలేంటి? లడ్డూ తయారీలో ఏయే పదార్థాలు ఉపయోగిస్తారు? లడ్డూ వెనక ఉన్న చారిత్రక నేపథ్యం ఏంటి? అనే విషయాలు తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే? ప్రపంచంలో ఇతరులు

## ఎలా తయారు చేస్తారు?

అనుకరించడానికి వీలులేకుండా భౌగోళిక ఉత్పత్తి లైసెన్సు ఉన్న ఏకైక లడ్డూ తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూ. అంటే తిరుమలేశుని లడ్డూ తయారీ పద్ధతిని ఎవరూ కాపీ కొట్టకూడదని దీనర్థం. తిరుమల ప్రసాదంలో 15వ శతాబ్ది నుంచి 20వ శతాబ్ది తొలినాళ్ల వరకూ ఇప్పుడు లడ్డూకు ఉన్న స్థానం అప్పట్లో వడకు ఉండేది. అప్పట్లో శ్రీవారికి నైవేద్యవేళలు (సంధి నివేదనలు) ఖరారు చేశారు. ఆ సమయాల్లోనే తిరుమల దర్శనానికి వచ్చే భక్తులకు ప్రసాదాలు పంచేవారు.

**తిరుమలేశుని ప్రసాదంగా లడ్డూ :**

ఆరోజుల్లో వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి వెళ్లిన భక్త జనులకు భోజన సదుపాయాలు లేవు. ఈ ప్రసాదాలు స్వీకరించే భక్తులు తమ ఆకలిని తీర్చుకునే వారు. వాస్తవానికి ఆంగ్లేయుల పాలనలో తిరుమల ఆలయ నిర్వహణను మహంతులు పర్యవేక్షించే వారు. వారు 19వ శతాబ్ది మధ్య భాగంలో ప్రసాదాల్లో తీపి బూందీని ప్రవేశపెట్టారు. 1940 నాటికి క్రమేపి ఆ తీపి బూందీ కాస్త లడ్డూగా రూపాంతరం చెందింది. కాలక్రమంలో "వడ" స్థానంలో "లడ్డూ" పూర్తి స్థాయి ప్రసాదమైంది. "లడ్డూ" పేరు వెనక ఇంత స్టోరీ ఉందా : సంస్కృతంలో లడ్డుకము, లాడుకము, లట్టికము అని, తెలుగులో అడ్డుకము, లడ్వము, తమిళంలో ఇలట్టు, లట్టు, లట్టుక అని పిలుస్తారు. 12వ శతాబ్దికి చెందిన "మానసోల్లాస గ్రంథం"లో వీటి ప్రస్తావన ఉన్నట్లు తెలుస్తోంది. హిబ్రూలో అనే పదంను లడ్డూకు సమానార్ధకంగా వాడుకలో ఉంది. ముద్దగా చేయడాన్నే "లడ్డు"గా పేర్కొన్నారు. లడ్డు పేరు వెనుక ఇంత కథ ఉందన్నమాట.

**లడ్డూ తయారీ శాల-పోటు:**

తిరుమలలో మూలమూర్తి కొలువై ఉండే గర్భాలయానికి శ్రీవారి పోటు (వంటశాల)కు ముందు వకుళామాత విగ్రహాన్ని నెలకొల్పారు. వాస్తు ప్రకారం ఆగ్నేయంగా నిర్మించిన చోట పోటు ప్రసాదాలను తయారు చేస్తారు. అలా తయారైన ప్రసాదాలను శ్రీనివాసుని మాతృమూర్తి వకుళామాత విగ్రహం వద్దకు తీసుకెళ్తారు.అక్కడ వకుళామాత ముందు ఉంచిన తర్వాత స్వామివారికి నైవేద్యంగా సమర్పించడమనేది తరతరాలుగా ఆనవాయితీగా వస్తుంది.లడ్డూ, వడలు తదితర ఫలహారాలు ఆలయంలో సంపంగి ప్రాకారం ఉత్తరభాగాన తయారు చేస్తారు. ఆ ఫలహారాలను కూడా వకుళామాతకు చూపించిన తర్వాతే ఆ స్వామివారికి నైవేద్యంగా అందిస్తారు. 1940 ప్రాంతంలో కల్యాణం మొదలైనప్పుడు మనం చూస్తున్న లడ్డూ తయారీ మొదలైంది. ఈ లడ్డూ తయారీకి ప్రత్యేక పద్ధతి అంటూ ఒకటి ఉందండోయ్. దిట్టం : శ్రీనివాసుని ఆలయంలో లడ్డూల తయారీకి వినియోగించే వస్తువులు, సరుకుల మోతాదును "దిట్టం" అని పిలుస్తారు. మొదటి సారిగా తిరుమల తిరుపతి పాలక మండలి 1950లో దిట్టంను నిర్ణయించారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా దిట్టాన్ని క్రమంగా పెంచుతూ వచ్చారు. ప్రస్తుతం 2001లో సవరించిన దిట్టాన్ని టీటీడీ అనుసరిస్తుంది. దీనినే పడితరం దిట్టం స్కేలుగా కూడా వ్యవహరిస్తున్నారు. పడి అంటే అర్థం 51 వస్తువులు. పడికి కావలసిన వస్తువులను "దిట్టం"గా ఉంచుతారు. ఆ విధంగా ఉగ్రాణం (శ్రీవారి స్టోర్) నుంచి వస్తువులను సమకూర్చుతారు. వాస్తవానికి మొదట్లో 5100 లడ్డూలు మాత్రమే తయారు చేసే వారు. తదనుగుణంగా కావాల్సిన దిట్టాన్ని కిలోల్లో సమకూర్చేవారు. తిరుమలకు భక్తుల తాకిడి పెరిగిన తర్వాత అంటే 2001లో ఈ దిట్టంను సవరించారు. 2001 దిట్టం స్కేలు ప్రకారమే లడ్డూలను ఇప్పటికీ తయారు చేస్తూవస్తున్నారు. 5100 లడ్డూల తయారీకి గాను 803 కేజీల సరుకులను వాడతారు. అంటే 803 కేజీల వివిధ రకాల సరుకులతో 5100 లడ్డూలు తయారు చేస్తారు.

**దిట్టంలో ఏయే సరుకులు ఉంటాయంటే :** ఆవు నెయ్యి - 165 కిలోలు చక్కెర - 400 కిలోలు, శెనగపిండి -180 కిలోలు , ఎండు ద్రాక్ష - 16 కిలోలు, యాలకులు - 4 కిలోలు కలకండ - 8 కిలోలు.ముంతమామిడి పప్పు - 30 కిలోలు, ఈ విధంగా ఒక దిట్టం నుంచి సుమారు 5100 లడ్డూలను తయారు చేస్తున్నారు. తొలినాళ్లలో ఈ లడ్డూను కట్టెల పొయ్యి మీద చేసేవారు. అయితే పొగ, కట్టెల కొరతను దృష్టిలో ఉంచుకుని పొయ్యిల స్థానంలో ప్రస్తుతం యంత్రాలను వినియోగిస్తున్నారు. ఈ లడ్డూ తయారీ పోటులో ఇప్పుడున్న అత్యాధునిక వంట సామాగ్రిని వినియోగించి రోజూ లక్షల లడ్డూలను తయారు చేస్తున్నారు.



## సీఎం రేవంత్ రెడ్డికి భారీ ఊరట

● ఓటుకు నోటు కేసులో సుప్రీం కీలక నిర్ణయం ● ఈ కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయబోమని స్పష్టం చేసిన న్యాయస్థానం

తెలంగాణ బ్యూరో ప్రతినిధిః సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుపై సుప్రీంకోర్ట్ శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును మధ్యప్రదేశ్కు బదిలీ చేయబోమని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథ్ల ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ బదిలీ పిటిషన్పై విచారణను అత్యున్నత న్యాయస్థానం ఇవాళ ముగించింది. ఓటుకు నోటు కేసును తెలంగాణా నుంచి మధ్యప్రదేశ్కు బదిలీ చెయ్యాలంటూ మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. విచారణను సీఎం ప్రభావితం చేస్తారన్న అపోహ తప్ప ఆధారాలు లేవని సుప్రీంకోర్ట్ వ్యాఖ్యానించింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా ఊహాజనితమైన అంశాలతో పిటిషన్ దాఖలు చేశారని కోర్ట్ వ్యాఖ్యానించింది. విచారణ జరుగుతున్న ఈ దశలో జగదీశ్వర్ రెడ్డి పిటిషన్ను పరిగణనలోకి తీసుకోచేయలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇక ఈ కేసు విచారణలో జోక్యం చేసుకోవద్దని రేవంత్కు సుప్రీంకోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. కేసుకు సంబంధించిన వివరాలను రేవంత్ రెడ్డికి రిపోర్ట్ చేయవద్దని ఏసీబీని కూడా కోర్ట్ ఆదేశించింది. సీఎం, హోంమంత్రికి ఏసీబీ డీజీ రిపోర్టు చేయనక్కర్లేదని పేర్కొంది. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి పర్యవేక్షణకు కూడా నిరాకరించింది. భవిష్యత్తులో సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుంటే పిటిషనర్ మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని ధర్మాసనం సూచించింది. ట్రయల్ కోర్టు పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఆదేశించింది. సుప్రీంకోర్ట్ ఇచ్చిన ఈ ఆదేశాలతో ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డికి భారీ ఊరట దక్కినట్టయింది.

**రేవంత్కు కీలక సూచనలు :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిన విషయం తెలిసిందే. బెయిల్పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్ట్ ఆగ్రహం వ్యక్తం చేయడం, ఆయన క్షమాపణలు చెప్పింది విధితమే. ఆ సందర్భంగా ప్రస్తావిస్తూ సుప్రీకోర్ట్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. తమ తీర్పులపై అభిప్రాయం చెప్పే హక్కు అందరికీ ఉంటుందని సుప్రీంకోర్ట్ పేర్కొంది. అయితే ప్రజా జీవితంలో ఉన్నవారు ఆచితూచి మాట్లాడాలని ఈ సందర్భంగా హితబోధ చేసింది.

# సింగరేణి కార్మికులకు బోనస్

## దసరాకు ముందే కార్మికుల కుటుంబాల్లో పండగ

● కార్మిక కుటుంబాలకు అందనున్న రూ.796 కోట్లు ● ఒక్కో కార్మికునికి రూ.1.90 లక్షలు
● తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకూ రూ.5 వేలు అందజేత ● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: సింగరేణి కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీపి కబురు అందించారు. సింగరేణి కార్మిక కుటుంబాల్లో ఆనందం నింపడమే లక్ష్యంగా దసరాకు ముందే బోనస్ ప్రకటించారు. గతేడాది సింగరేణి సంస్థ ఉత్పత్తి, గడించిన లాభాల ఆధారంగా బోనస్ను ప్రకటించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఒక్కో కార్మికునికి రూ.1.90 లక్షలు, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేలు చొప్పున బోనస్ ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రక్రియలో సింగరేణి కార్మికులు అగ్రభాగాన నిలిచారని, ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లడంతో గని కార్మికుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి కొనియాడారు. అనంతరం సింగరేణి లాభాలు, విస్తరణ.. బోనస్కు సంబంధించిన వివరాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విలేకరులకు వివరించారు. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న సింగరేణి సంస్థ రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాలతో పాటు ఇతర సంస్థలకు బొగ్గు సరఫరా చేయడంతో పాటు ఇతర రాష్ట్రాలకు బొగ్గు ఎగుమతి చేస్తోంది. సింగరేణి కార్మికుల శ్రమతో 2023-24 సంవత్సరంలో సంస్థకు మొత్తంగా రూ.4,701 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో సంస్థ విస్తరణ, పెట్టుబడులకు రూ.2,289 కోట్లు కేటాయించగా మిగిలినవి రూ.2,412 కోట్లు. ఇందులో మూడో వంతు రూ.796 కోట్లను కార్మికులకు బోనస్గా ప్రకటిస్తున్నాం. సింగరేణిలో మొత్తం 41,387 మంది శాశ్వత కార్మికులు, ఉద్యోగులు ఉన్నారు. ఒకొక్కరికి బోనస్ కింద రూ.1.90 లక్షలు అందించనున్నాం. గతేడాది సింగరేణి కార్మిలకు అందిన బోనస్ రూ.1.70 లక్షలు మాత్రమే. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఒకొక్కరికి అదనంగా అందుతున్న మొత్తం రూ.20 వేలు.

**కాంట్రాక్ట్ కార్మికులకూ**

సింగరేణి సంస్థ చరిత్రలోనే తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకూ రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. సంస్థలో 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. వారందరికీ తొలిసారిగా రూ.5 వేల బోనస్ను అందజేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దసరా పండగకు ముందే ఈ మొత్తాన్ని వారికి అందజేయనున్నట్లు ఆయన చెప్పారు.

**విస్తరణే లక్ష్యంగా**

సింగరేణి సంస్థ ఆర్జించిన లాభాలను భవిష్యత్ అవసరాలకు తగినట్లు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాని ప్రకారం సోలార్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని 1000 మెగావాట్లకు విస్తరించడం, రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణం, జైపూర్లోని ప్రస్తుత థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రంలో మరో 1800 మెగావాట్ల సామర్థ్యం కల మరో థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, రామగుండంలో టీఎస్ జెన్ కో ఆధ్వర్యంలో మరో 1800 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, ఒడిశాలోని నైనీ బ్లాక్పైన (పిట్హెడ్) 2,400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సంస్థ పరిధిలోని వీకే ఓపెన్ కాస్ట్, గోలేటీ, నైనీ ఓసీలను ప్రారంభిస్తామని, సింగరేణి కార్మికులు, ఉద్యోగుల పిల్లల కోసం నూతన రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణతో పాటు హైదరాబాద్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. విలేకరుల సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రేమ్సాగర్రావు, సింగరేణి ఎండీ బలరాం, కార్మిక సంఘా ల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జానీ మాస్టర్ కేసులో కీలక పరిణామం...

## రిమాండ్ విధింపు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తన వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్గా పనిచేస్తున్న 21 ఏళ్ల యువతిపై జానీ మాస్టర్ అత్యాచారం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. జానీ మాస్టర్కు అక్టోబర్ 3 వరకు రిమాండ్ విధిస్తూ ఉప్పర్పల్లి కోర్ట్ తీర్పునిచ్చింది. మొత్తం 14 రోజులు రిమాండ్ విధిస్తున్నట్టు న్యాయస్థానం వెల్లడించింది. మరి కాసేపట్లో పోలీసులు ఆయనను చెంచలగూడ జైలుకు తరలించనున్నారని తెలుస్తోంది. జానీ మాస్టర్పై ఫోక్స్ యాక్ట్ కింద కేసు నమోదవడంతో రంగారెడ్డి జిల్లా కోర్టులో ఆయన తరఫు న్యాయవాది బెయిల్ పిటిషన్ వేయనున్నారని సమాచారం. జానీ మాస్టర్పై నమోదైన అత్యాచారం కేసులో దర్యాప్తు వేగం పుంజుకుంది. ఇవాళ ఉదయం పోలీసులు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జాయ్ హాస్పిటల్లో వైద్య పరీక్షలు చేపించారు. అనంతరం ఆయనను రాజేంద్రనగర్ సీసీఎస్కు తరలించారు. అక్కడి నుంచి ఉప్పర్పల్లి కోర్టుకు తీసుకెళ్లి జడ్జి ముందు ప్రవేశపెట్టారు. నిన్న గురువారం గోవాలో అరెస్ట్ చేసి హైదరాబాద్ తరలించారు.

జానీ ప్రశ్నించేందుకు సమయం దొరక్కపోవడంతో పోలీసులు కస్టడీకి కోరే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. తన వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్గా పనిచేసిన 21 ఏళ్ల యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డట్టు జానీ మాస్టర్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు ఆయనపై అత్యాచారం కేసు నమోదయింది. కేసు విషయం తెలుసుకొని ఆయన పరారయ్యారు. బెంగళూరు గుండా గోవా వెళ్లారు. రంగంలోకి దిగిన పోలీసులు గోవాలో ఉన్నట్టు ట్రాక్ చేసి అరెస్ట్ చేశారు. రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు గోవాలో గురువారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గోవా స్థానిక కోర్టులో ప్రవేశపెట్టి పీటీ వారెంట్ తీసుకుని.. హైదరాబాద్ తీసుకొచ్చారు. జానీ మాస్టర్పై ఈ నెల 15న రాయదుర్గం పోలీస్ స్టేషన్లో లైంగిక వేధింపులకు సంబంధించి జీరో ఎఫ్ఐఆర్ నమోదయింది. అదే రోజున నార్సింగ్ పోలీసులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం బాధితురాలి వాంగ్మూలాన్ని సేకరించారు.

## పోషక ఆహారంపై అవగాహన



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: పోషక ఆహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెప్టెంబర్ నెల పోషణ మాసం సందర్భంగా శుక్రవారం గురుకులం మహేంద్రహిల్స్ యెన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో డిగ్రీ న్యూట్రిషన్ విద్యార్థులు, ప్రోగ్రాం ఆఫీసర్ జ్యోతిర్మయి కలిసి అంకుషాపూర్ విల్లెజ్ లో అవగాహనా ర్యాలీగా వెళ్లి అంగన్వాడీ సెంటర్లో చిన్న పిల్లలు , గర్భిణీ స్త్రీలు, బాలింతలు, ముదుసలి మహిళలను కలిసి వారిని పోషకాహారం యొక్క ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు, ఇందులో భాగంగా జడ్పీ ఉన్నత పాఠశాల ను సందర్శించి అక్కడ ఉన్న విద్యార్థులను ఉద్దేసించి పాటలతో ఉత్తేజపరిచి పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.

# నేటి నుంచి మళ్లీ కాళేశ్వరంపై విచారణ



## హాజరుకానున్న కీలక అధికారులు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: జస్టిస్ పి.సి. ఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ విచారణ శుక్రవారం నుంచి మళ్లీ తిరిగి ప్రారంభం కానుంది. దీంతో ఈ కమిషన్ ఎదుట విచారణకు ఈ రోజు ఏడుగురు చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారులు హాజరు కానున్నారు. అలాగే రీసెర్చ్ ఇంజనీర్లతోపాటు అడ్మినిస్ట్రేటివ్ అధికారులు సైతం ఈ కమిషన్ ఎదుట నేడు విచారణను ఎదుర్కొనున్నారు.

శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ విచారణకు 25 అధికారులు హాజరుకానున్నారని తెలుస్తుంది. మరోవైపు ఈ ప్రాజెక్టు సంబంధించి నివేదిక సమర్పించాలని ఎన్డీఎస్ఏకు కమిషన్ లేఖ రాసింది. అదే విధంగా జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ అడిగిన లాయర్ను కేటాయించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సంసిద్ధత వ్యక్తం చేసింది.

అయితే ఈ విచారణలో భాగంగా హాజరవుతున్న ప్రతి ఒక్కరి నుంచి అఫిడవిట్ రూపంలో కమిషన్ వివరాలు తీసుకుంటుంది. ఈ ఏడాది ఆగస్టో ఈ ప్రాజెక్టు సంబంధించి 15 మందికిపైగా అధికారులను ఈ కమిషన్ విచారించింది. ఈ సందర్భంగా వారి స్టేట్మెంట్లను జస్టిస్ చంద్ర ఘోష్ కమిషన్ రికార్డు చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. అయితే గతేడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ప్రాజెక్టోని కొన్ని పిల్లర్లు కుంగాయి. దీంతో వేల కోట్ల రూపాయిలతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్ నాణ్యతపై నీలి నీడలు కమ్ముకున్నాయి. దాంతో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పించాయి.

ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు రానే వచ్చాయి. తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరింది. నాటి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ ప్రాజెక్టు విచారణ జరపాలని రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి.సి.ఘోష్ నేతృత్వంలో కమిషన్ విచారణ జరుపుతుందని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ క్రమంలో ఈ ప్రాజెక్టు జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ విచారణ చేపట్టింది. అయితే ఇప్పటికే ఈ కమిషన్ కాల పరిమితి ముగిసింది. దీంతో ఈ కమిషన్ గడువు పెంచుతూ.. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం విధితమే.

## 22న కులగణన చేయాలని బిసి కులాల సదస్సు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఈనెల 22 ఆదివారం హోటల్ అశోక హైదరాబాదులో అఖిలపక్ష పార్టీల, కుల సంఘాల మరియు బి.సి సంఘాల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు బి.సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మరియు జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ప్రకటనలో తెలిపారు. బి.సి కులగణన చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బి.సి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం బి.సి ల రిజర్వేషన్లు పెంచాలని, పార్లమెంటులో బి.సి బిల్లు పెట్టి, చట్టసభలలో బి.సిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలు మరియు కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని తదితర డిమాండ్ల సాధనకై ఈనెల 22న సదస్సు నిర్వహిస్తున్నట్లు జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య మరియు కన్వీనర్ గుజ్జా కృష్ణ తెలిపారు.

# త్వరలో రెడ్ కార్నర్ నోటీసులు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఏ1 ప్రభాకర్ రావు, ఏ6 శ్రవణ్ రావుపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని ఇంటర్ పోల్కు సీబీఐ లేక రాసింది. హైదరాబాద్ పోలీసుల విజ్ఞప్తిని సీబీఐ అనుమతించింది. ఇంటర్ పోల్ ద్వారా ప్రభాకర్ రావు, శ్రవణ్రావులకు త్వరలో రెడ్ కార్నర్ నోటీసులు జారీ కానున్నాయి. కేసులో ప్రధాన నిందితులుగా భావిస్తున్న ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులు ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు గుర్తించారు.

కాగా ఇప్పటికే ప్రభాకర్ రావుపై కోర్టు నాన్బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. ప్రభాకర్రావు వర్చువల్గా విచారణకు హాజరవుతారని కోర్టు దృష్టికి దర్యాప్తు బృందం తీసుకెళ్లింది. ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైన తర్వాత అమెరికాకు ప్రభాకర్ రావు వెళ్లిపోయిన విషయం తెలిసిందే. అమెరికాలో ఉన్న ఆయనను ఇండియాకు రప్పించేందుకు సీఐడీ ముమ్మరంగా ప్రయత్నిస్తుంది. ముందుగా ప్రభాకర్ రావుకు రెడ్ కార్నర్ నోటీస్ జారీ చేసింది.రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసిన విషయాన్ని సీబీఐకి సీఐడీ అధికారులు తెలిపారు. సీబీఐ నుంచి ఇంటర్ పోల్కి సీఐడీ అధికారులు సమాచారం అందజేశారు. అమెరికాలో ఉన్న ప్రభాకర్ రావుని ఇండియాకు రప్పించేందుకు సీఐడీ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇప్పటికే ప్రభాకర్ రావుపైన నాన్బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. ప్రభాకర్ రావుని హాజరుపరచాలని ఇప్పటికే నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆరోగ్యం బాగోలేనందున విచారణకు హాజరు కాలేనని సిట్కు ప్రభాకర్ రావు తెలిపారు.

ఇంటర్ పోల్ ద్వారా ప్రభాకర్ రావుని హైదరాబాద్కు రప్పించేందుకు సిట్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అమెరికాతో సిట్కు ఉన్న ఒప్పందాల ప్రకారం ప్రభాకర్ రావుని ఇండియాకు రప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభాకర్ రావు ఒకవేళ విచారణకు హాజరైతే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు కీలకంగా ఉన్నారు. ఫోన్ ట్యా పింగ్ కేసులో ఏ 6గా ఉన్న శ్రవణ్ రావు పైన కూడా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేశారు. శ్రవణ్ రావ్ ఎక్కడ ఉన్నారో తమకు తెలియదని కోర్టుకు సీఐడీ అధికారులు తెలిపారు. త్వరలోనే ప్రభాకర్ రావు శ్రవణ్ రావులని హైదరాబాద్కు రప్పించే ప్రయత్నం చేస్తున్నామని సిట్ అధికారులు చెప్పడం గమనార్హం.



## ఉద్యోగులకు ప్రభుత్వం బకాయిపడిన
## 4 డిఎలు వెంటనే విడుదల చేయాలి

● టిపిటిఎఫ్ అధ్యక్షుడు వై అశోక్ కుమార్
● ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి





తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఉద్యోగులకు గత ప్రభుత్వంలోనే మూడు డి ఏ లు పెండింగ్ లో ఉండగా ఈ ప్రభుత్వ ఏర్పడ్డ తర్వాత మరో రెండు డి. ఏ లు బకాయి పడింది. ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు పూర్తి అయినా నేటికీ డి. ఏ లు ప్రకటించకపోవడం, గత ప్రభుత్వం వేసిన పి ఆర్సీ కమిటీ రిపోర్ట్ వెంటనే తెప్పించుకునే ఆలోచన చేయకపోవడం, ఈరోజు నిర్వహించిన మంత్రి వర్గంలో ఉద్యోగులకు కనీసం రెండు డి ఏ ప్రకటిస్తుందని ఆశించిన ఉద్యోగులకు నిరాశే కలిగించిందని తీపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై. అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డిలు అన్నారు.అన్ని ప్రభుత్వ రంగాలలో ఇటీవలి కాలంలో బదిలీలు, పదోన్నతులు చేయడం అభినందనీయం కానీ అదేసమయంలో బదిలీ కాలం జీతాలను సైతం నేటికీ చెల్లించడం లేదు. మార్చి నెల నుండి పదవీ విరమణ పొందిన వారికి పదవి విరమణ బెనిఫిట్స్ ఇప్పటికీ చెల్లించకపోవడం శోచనీయం అని అన్నారు. జి పి ఎఫ్ ఖాతాలలో దాచుకున్న డబ్బులను, ప్రభుత్వ జీవిత బీమాలో జమ చేసిన డబ్బులను, మెడికల్ రీయింబర్స్మెంట్, సరెండర్ సెలవుల నగతు డబ్బులు సుమారు రెండు సంవత్సరాలుగా ఆర్థిక శాఖ వద్ద పెండింగ్ లో ఉన్నాయన్నారు. నెలంతా పనిచేసిన ఉద్యోగులకు ఒకటో తేదీన జీతం పొందడం ఉద్యోగి హక్కు. కొన్ని మెనేజిమెంట్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకటో తేదీన వేతనాలు ఇచ్చి మరి కొందరికి ఆలస్యంగా చెల్లిస్తున్న పద్ధతి గత ప్రభుత్వం మాదిరిగానే కొనసాగుతుందన్నారు. ఉద్యోగులకు న్యాయం చేస్తామని తెలిపిన పాలకులు సాచివేత వైఖరితో వ్యవహరించకుండా వెంటనే బాకాయి పడిన డి ఏ లను, పి ఆర్సీ అమలు, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.అశోక్ కుమార్, పి.నాగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఆరోగ్యమిత్రల జీతం పెంపు

### సమ్మె విరమించేందుకు అంగీకారం



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని ఆరోగ్య మిత్రలు సమ్మె విరమించారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ చొరవ తీసుకొని వారి సమస్యలను పరిష్కారం దిశగా చర్చలు జరిపారు. గత పది సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఆరోగ్య మిత్రల ప్రధాన డిమాండైనా క్యాడర్ మార్పు (డేటా ఆపరేటర్)ను అంగీకరించారు. వేతనాన్ని కూడా 15,600 నుంచి 19,500 కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని మంత్రి దామోదర ప్రకటించారు.మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవతో సమ్మె విరమిస్తూ ఆరోగ్య మిత్రలు లేఖను విడుదల చేశారు. ప్రభుత్వం సానుకూలంగా తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవల విధులలో పాల్గొంటున్నట్టుగా ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వంతో పాటు మంత్రి దామోదర్ కు కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ ట్రస్టు అనుసంధానమైన అన్ని దవాఖానల్లో ఆరోగ్యమిత్రలు పని చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 800 మందికిపైగా ఆరోగ్యమిత్రలు సేవలు అందిస్తున్నారు. రోగులు ఆహార భద్రత కార్డును తీసుకెళ్లి వీరికి చూపిస్తే ఆరోగ్యశ్రీ కౌంటర్లో రిజిస్టర్ చేస్తారు. అక్కడి నుంచి ఉచితంగా వైద్యసేవలు అందించే బాధ్యతను ఆరోగ్యమిత్రలు తీసుకుంటారు.రాష్ట్రంలో చూస్తే ప్రతి నెల సగటును పది లక్షల మందికిపైగా రోగులు ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య సేవలు పొందుతున్నారు. వీరికి కావాల్సిన ప్రాథమిక సమాచారం, రిజిస్ట్రేషన్ తో పాటు మొదలుగు ప్రక్రియలన్నింటిని ఆరోగ్యమిత్రలు పర్యవేక్షిస్తారు.ఉచితంగా ఓపీ, ఐపీ సేవలు అందేలా కూడా ఆరోగ్యమిత్రలే చూస్తారు. అర్హతలను బట్టి ఆరోగ్యశ్రీ కిందికి వస్తారా లేరా అనేది నిర్ణయిస్తారు. రోగులకు అందే ఆహారం, చికిత్స తీరు, డయాలిస్ సేవలను కూడా పర్యవేక్షిస్తుంటారు. రోగికి ఇబ్బంది లేకుండా తగిన సమాచారం అందజేస్తుంటారు.

## దేశంలో తెల్లరేషన్ కార్డుల సంఖ్య తగ్గాలి

● ఉచితాలు వద్దు మేం బ్రతకగలం అనే స్థాయి ప్రజల్లో రావాలి ● దేశం అటువైపు వెళ్ళాలి.. ప్రజలు వారి కాళ్ళ మీద బ్రతికే దిశగా ఎదగాలి ● పీఎం విశ్వకర్మ మొదటి వార్షికోత్సవ సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్
● విద్యానగర్‌లో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ : ఎంపీ ఈటల



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఆడపిల్లలు కూడా సమాజంలో సమానంగా ఎదుగుతున్నారు. తిండికి లేకపోయినా తల్లిదండ్రులు పిల్లల్ని చదివిస్తున్నారు. భారతదేశం యువశక్తి గల దేశం.. ఆ యువశక్తి పాన్ డబ్బాల దగ్గర ఉండకూడదు అని కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ట్రైనింగ్ ఇప్పిస్తుందని బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పీఎం విశ్వకర్మ మొదటి వార్షికోత్సవ సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్. విద్యానగర్ లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రోత్సాహకాలు అందిస్తుందని,నా తపన కూడా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం. స్వయంశక్తి మీద బ్రతికేలా చేయడం. పేదలకు బ్యాంకులు షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలన్నారు. పెద్దలు బ్యాంక్ రుణాలు ఎగ్గొడుతున్నారేమో కానీ మన మహిళా సంఘాలు 98 శాతం రిపేమెంట్ చేస్తున్నాయని, నైపుణ్యం, సృజనాత్మకత ఉన్న వారికి ఆర్థిక సాయం అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. ప్రాచీన వృత్తులు కాపాడుకోవాలి. దీనికోసం నేను మంత్రిగా ఉన్నప్పుడు నిత్యం ఆరాటపడ్డాను. వృత్తి పనులు చేసే వారు సమాజం మేలు చేసేవారు. చేతి వృత్తుల వారు జీవితాలను త్యాగం చేసి మానవ కళ్యాణానికి తోడ్పడే వాళ్ళు. వారికి ఏం ఇచ్చినా తక్కువే. చేతి వృత్తుల వారి పట్ల మన మైండ్ సెట్ మారాలి. వారిపట్ల చిన్న చూపు తగదు. ఆపదలో ఉన్నవాడికి అవసరం ఉన్నవాడికి సాయం చేసేవాడే నిజమైన మనిషి. 77 సంవత్సరాల తరువాత కూడా ఈ దేశంలో పేదరికం ఉంది, ఆకలి ఉందనే ప్రధాని నరేంద్ర మోడీ గారు పీఎం విశ్వకర్మలాంటి స్కీంలు తీసుకువచ్చారు. ఈదేశంలో తెల్లరేషన్ కార్డు సంఖ్య తగ్గాలని. ఉచితాలు వద్దు మేం బ్రతకగలం అనే స్థాయి ప్రజల్లో రావాలి. దేశం అటువైపు వెళ్ళాలి.. ప్రజలు వారి కాళ్ళ మీద బ్రతికే దిశగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా పీఎం విశ్వకర్మ ట్రైనింగ్ పూర్తి చేసినవారికి సర్టిఫికెట్లు అందించారు.మనసంస్కృతి సంప్రదాయలు కాపాడడానికి, కులవృత్తులు ప్రోత్సహించడానికి పీఎం విశ్వకర్మ పథకం తీసుకువచ్చారు. ఎన్నికల వల్ల టార్గెట్ పూర్తి కాలేదు. 20 లక్షల కుటుంబాలకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికి 2.6 లక్షలు పూర్తయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన మిగతావి పూర్తి చేస్తాం. స్పెషల్ ప్రోగ్రాం ద్వారా ఎంపిక చేస్తాం. బ్యాంక్ సమస్యలు, ట్రైనింగ్ సమస్యలు చెప్పారని,సంపూర్ణంగా రివ్యూ చేసి సజావుగా అన్ని వర్గాల పెద ప్రజలకు అందిస్తున్నామన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్** GHMC

నిట్ నెం.28/SE(M)/SBZ/GHMC/2024-25, తేది: 19-09-2024

**పని యొక్క పరిధి:** "PPP విధానంలో GHMCలోని అమీర్‌పేట్ మరియు షేక్‌పేట్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను అప్‌గ్రేడ్ చేయడానికి, నిర్వహిం చడానికి మరియు నిర్వహించడానికి ఏజెన్సీ ఎంపిక కోసం RFP పత్రాలను సిద్ధం చేయడానికి కన్సల్టెంట్ నియామకం" కోసం ప్రతిపాదన కోసం అభ్యర్థన. **బిడ్స్ స్వీకరణకు RFP వెబ్‌సైట్ నుండి ప్రారంభ తేది మరియు సమయం :** 20-09-2024 మ॥ 3.00 గం॥లకు. **ప్రీ-బిడ్ మీటింగ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వారి కార్యాలయం, సికింద్రాబాద్ జోన్,** GHMC, **వద్ద, తేది: 25-09-2024 మ॥ 5.00 గం॥ల వరకు. స్వీకరణకు చివరి తేది మరియు సమయం:** 04-10-2024 మ॥ 1.00 గం॥లకు. **అధికారి పేరు మరియు చిరునామా:** సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, GHMC, సెల్: 9989930374. ఇతర వివరములను **http://www.ghmc.in** ఈ కార్యాలయం యొక్క టెండర్ నోటిఫికేషన్ నోటీసు బోర్డులో చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, GHMC

DIPR.RO.No.4326-PP/CL/Advt/1/2024-25 , Dt: 20-09-2024

# సుప్రీంకోర్టు యూట్యూబ్ ఛానల్ హ్యాక్

ఢిల్లీ: తాజాగా సైబర్ కేటుగాళ్ళు ఏకంగా సుప్రీంకోర్టు యూట్యూబ్ చానల్ను హ్యాక్ చేశారు. శుక్రవారం ఉదయం కోర్టుకు సంబంధించిన వివరాలు కాకుండా రిపిల్ ల్యాబ్స్ అనే అమెరికా ఆధారిత కంపెనీ అభివృద్ధి చేసిన క్రిప్టోకరెన్సీ ని ప్రమోట్ చేసే వీడియోలు చానల్లో ప్రసారం కావడం కలకలం రేపింది. గుర్తించిన సుప్రీంకోర్టు రిజిస్ట్రీ వెంటనే చానల్ లింక్ని నిలిపివేసింది. చానల్ని రికవరీ చేసే చర్యలు చేపట్టింది. ఈ యూట్యూబ్ చానల్ ద్వారా బెంచ్ విచారించే కేసులను ప్రజా ప్రయోజనాల కింద ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన న్యాయమూర్తుల నియామకాన్ని కేంద్రానికి నిర్ణీత కాలపరిమితిని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం సహా అనేక ముఖ్యమైన కేసులను సుప్రీంకోర్టు విచారించనున్న రోజే హ్యాకింగ్ జరిగింది. ఆర్జీ కర్ హాస్పిటల్ ట్రైనీ డాక్టర్పై అత్యాచారం, హత్య కేసును చానల్ ప్రసారం చేస్తున్న సమయంలో క్రిప్టో కరెన్సీని ప్రమోట్ చేస్తున్నట్లుగా ఉన్న వీడియోలు కనిపించాయి. అనేక ముఖ్యమైన కేసులను సుప్రీంకోర్టు విచారించనున్న రోజే హ్యాకింగ్ ఘటన జరిగింది. హ్యాకింగ్పై సుప్రీంకోర్టు పరిపాలన విచారణ ప్రారంభించిందని బార్ అండ్ బెంచ్ వర్గాలు తెలిపాయి. 2018లో అన్ని రాజ్యాంగ ధర్మాసన విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి నిరంతరాయంగా నడిచిన యూట్యూబ్ చానల్ హ్యాక్ కావడం ఇదే తొలిసారి. ఈ యూట్యూబ్ ఛానల్ లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారించే కేసులతో పాటు కొన్ని కీలక కేసుల విచారణను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంటారు.






## తిరుమల లడ్డూ కల్తీపై

# తీవ్రంగా పరిగణించిన కేంద్రం





● శ్రీవారి లడ్డూ కల్తీపై సమగ్ర నివేదిక ఇవ్వండి ● ఏపీ సీఎం చంద్రబాబును కోరిన కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ● ఈ విషయంలో రాష్ట్రానికి కేంద్రం సహకరిస్తుంది ● ఫుడ్ సేఫ్టీ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం: జేపీ నడ్డా

ఢిల్లీ: తిరుమల శ్రీవారి మహా ప్రసాదం లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వులు కలిపినట్లు వచ్చిన ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. తాజాగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా దీనిపై స్పందించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. దిల్లీలో జరిగిన కార్యక్రమంలో నడ్డా మాట్లాడుతూ "నేను ఆయనతో (సీఎం చంద్రబాబు) మాట్లాడాను. వారి వద్ద ఉన్న సమాచారాన్ని పంపించమని చెప్పాను. కేంద్రం ఈ విషయంలో రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తుంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్-ఎస్ఏఐ) నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకొంటాం. ఇప్పటికి నివేదికే కోరాం" అని తెలిపారు. తిరుమల ప్రసాదంలో కల్తీపై మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా స్పందించారు. ఇది ఏమాత్రం క్షమించరాని నేరమని ఆయన అభివర్ణించారు. అదే సమయంలో ఈ వ్యవహారంలో మత కోణం ఉంటుందనే అనుమానం వ్యక్తం చేశారు. బోర్డులో అన్యమతస్తుల కారణంగానే కల్తీ నెయ్యి సరఫరా అయిందన్నారు.

**ఇది ప్రజల విశ్వాసంపై దాడి: ముక్తార్ అబ్బాస్ నఖ్వీ**

తిరుమల ప్రసాదంలో కల్తీపై భాజపా సీనియర్ నేత ముక్తార్ అబ్బాస్ నఖ్వీ స్పందించారు. "ఇది ప్రజల విశ్వాసంపై నేరుగా జరిగిన దాడి. వారి నమ్మకాన్ని వమ్ముచేయడమే. పక్కా ప్రణాళికతో జరిగిన కుట్ర ఇది. కేవలం వ్యాపార ప్రయోజనాల కోసం కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. దీనికి కారకులను కఠినంగా శిక్షించాలి. ఇది ఏమాత్రం క్షమించరాని నేరం" అని వ్యాఖ్యానించారు. 'వైకాపా ప్రభుత్వంలో హయాంలో అపవిత్రంగా లడ్డూలు తయారు చేశారు. వాటిల్లో వినియోగించిన ముడిసరకులు నాణ్యమైనవి వాడకపోవడం ఒక ఎత్తు.. అపవిత్రమైనవి వాడటం మరో ఎత్తు. తితిదే పరీక్షలు చేయించగా ఈ విషయం నిర్ధారణయింది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం స్పష్టం చేశారు. తిరుమలలో ఇప్పటికే ఈ విషయంలో మార్పులు చేశామన్నారు. లడ్డూ తయారీలో నాణ్యమైన నెయ్యి వాడుతున్నామని.. దీంతో లడ్డూ నాణ్యత మెరుగుపడిందని చెప్పారు. దీన్ని మరింత మెరుగుపరుస్తామని, తిరుపతిని ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు.

**ఇది చాలా తీవ్రమైన విషయం.. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీ**

తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో నాసిరకం వస్తువులతో పాటు జంతువుల కొవ్వు వినియోగించారనే ఆరోపణలతో చెలరేగిన దుమారంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీ స్పందించారు. దిల్లీలో జరుగుతున్న గ్లోబల్ ఫుడ్ రెగ్యులేటరీస్ సమ్మిట్కు హాజరైన ఆయన.. ఈ అంశంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. "ఇది చాలా తీవ్రమైన విషయం. అందరినీ ఆందోళనకు గురిచేసే అంశం. ఇది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం. ఏపీలో సీఎం చెప్పినట్లు ఇది చాలా తీవ్రమైనది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలి. ఆ తర్వాత తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవాలి" అన్నారు.

# నేడే శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు

## ఎన్నికల బరిలో 38 మంది అభ్యర్థులు



కొలంబో: శనివారం శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. తీవ్ర ఆర్థిక సంక్షోభం తర్వాత అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. అధ్యక్ష ఎన్నికల చరిత్రలో తొలిసారి బరిలో 38 మంది అభ్యర్థులు ఉన్నారు. రణిల్ విక్రమసింఘే, సాజిత్ ప్రేమదాస, అనుర కుమార దిస్సనాయకే మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మొత్తం 1.7 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. 13 వేల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫలితాలు మాత్రం ఆదివారం వెలువడనున్నాయి. ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే(75) ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని బయటకు తీసుకొచ్చే ప్రయత్నాలు చేశారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి త్వరగా కోలుకోవడంతో నిపుణుల నుంచి ప్రశంసలు పొందారు. ప్రస్తుతం త్రిముఖ ఎన్నికల పోరు నెలకొంది. 1982 తర్వాత శ్రీలంక అధ్యక్ష ఎన్నికల చరిత్రలో త్రిముఖ పోటీ ఇదే తొలిసారి అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2020 పార్లమెంటు ఎన్నికల్లో ముగ్గురు ప్రధాన పోటీదారులు ఎదురుదెబ్బలు చవిచూసినందున ఈ ఎన్నికలు గతంలో జరిగిన అన్ని అధ్యక్ష ఎన్నికల కంటే భిన్నమైనవి అని విశ్లేషకుడు కుసల్ పెరీరా తెలిపారు. అనధికారిక ఒపీనియన్ పోల్స్ ప్రకారం ఫ్రంట్ రన్నర్గా చెప్పబడుతున్న దిసానాయకే 2020 పార్లమెంట్ ఎన్నికలలో కేవలం మూడు శాతం ఓట్లను పోల్ చేయగా.. విక్రమసింఘే కేవలం 2 శాతం.. ప్రేమదాస 25 శాతం కంటే ఎక్కువ ఓట్లు మాత్రమే సాధించారు. 2022లో శ్రీలంక ఆర్థిక పతనంలో మునిగిపోవడంతో ప్రజా తిరుగుబాటు ద్వారా అప్పటి అధ్యక్షుడు గోటబయ రాజపక్సేను దేశం విడిచి పారిపోయేలా చేసింది. దాదాపు 17 మిలియన్ నమోదిత ఓటర్లు ఈ ఎన్నికల్లో 13,400 పోలింగ్ స్టేషన్లలో ఓటు వేయడానికి అర్హులు. 80 శాతం పోలింగ్ నమోదయ్యే అవకాశం ఉంది. పోల్ ఫలితాలు ఆదివారం వెలువడనున్నాయి.



# కాంగ్రెస్ అత్యంత అవినీతి పార్టీ

● కాంగ్రెస్లో ద్వేషం అనే దెయ్యం ప్రవేశించింది ● ఇప్పుడున్నది గతంలోని కాంగ్రెస్ కాదు ● కాంగ్రెస్ అంటేనే అబద్ధం, మోసం ● ఆ పార్టీలో దేశ భక్తి, స్ఫూర్తి తుడిచిపెట్టుకుపోయాయి ● అర్బన్ నక్సల్స్, తుక్డే తుక్డే గ్యాంగ్ కాంగ్రెస్ను నడిపిస్తున్నాయి ● కాంగ్రెస్ చేస్తున్న పాపాలకు తగిన బుద్ధి చెప్పాలి ● మహారాష్ట్రలోని వార్ధాలో ప్రధాని మోడీ పిలుపు

ముంబై: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోడీ నిప్పులు చెరిగారు. మహారాష్ట్రలోని వార్ధాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. అర్బన్ నక్సల్స్, తుక్డే తుక్డే గ్యాంగ్ కాంగ్రెస్ను నడిపిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పుడున్నది గతంలోని కాంగ్రెస్ కాదని, ఆ పార్టీలో దేశభక్తి, స్ఫూర్తి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని అన్నారు. కాంగ్రెస్ అంటేనే అబద్ధం, మోసం, నిజాయతీ లేకపోవడం అని విమర్శించారు. తెలంగాణలో రుణమాఫీ చేస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చి రైతుల నుంచి తప్పించుకొని తిరుగుతోందని మండిపడ్డారు. గణపతి ఉత్సవాలను కూడా ఆ పార్టీ వ్యతిరేకిస్తోందని మోదీ పునరుద్ఘాటించారు. "నేటి కాంగ్రెస్ గణపతి పూజను కూడా అసహ్యించుకుంటోంది. స్వాతంత్ర్య పోరాట సమయంలో లోకమాన్య బాల గంగాధర్ తిలక్ నాయకత్వంలో దేశ ఐక్యతను పెంచడానికి గణపతి ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలు కలిసి పాల్గొంటారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వినాయకుడి విగ్రహాన్ని పోలీసు జీపులో ఎక్కించి, అవమానించిన ఘటన మీ అందరికీ తెలుసు. ప్రజలు పూజించిన దేవుని విగ్రహాన్ని పోలీసు వ్యాన్లో బంధించారు. ఈ విషయంపై కాంగ్రెస్ మిత్రపక్షాలు కూడా మౌనంగా ఉండడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. కాబట్టి మనమంతా ఏకమై కాంగ్రెస్ చేస్తున్న పాపాలకు తగిన బుద్ధి చెప్పాలి" అని మోదీ అన్నారు. నేటి కాంగ్రెస్లో దేశభక్తి స్ఫూర్తి చచ్చిపోయి, ద్వేషం అనే దెయ్యం ప్రవేశించిందని మోదీ దుయ్యబట్టారు. కర్ణాటక, తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కష్టాల్లోకి నెట్టేస్తోందని అన్నారు. విదేశాలకు వెళ్లి దేశానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ భరతమాతను, దేశ సంస్కృతిని అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో అత్యంత అవినీతికరమైన కుటుంబం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ రాజకుటుంబమే అని ప్రధాని తీవ్రంగా మండిపడ్డారు.

# కశ్మీర్ ఎన్నికలపై విషం కక్కిన పాక్

## అంతర్జాతీయంగా విలువ లేదన్న పాకిస్థాన్




కరాచీ: జమ్మూ కశ్మీర్లో జరుగుతున్న ఎన్నికలపై మన దాయాది పాకిస్థాన్ విషం కక్కింది. తొలి దశలో భారీ ఓటింగ్ నమోదు చేసుకోవడం జీర్ణించుకోలేక పోతోంది. భారత్పై అవకాశం చిక్కినప్పుడల్లా పాకిస్థాన్ విషం చిమ్ముతూనే ఉంది. పదేళ్ల తర్వాత జమ్మూకశ్మీర్లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు హాస్యాస్పదమని పాకిస్థాన్ అభివర్ణించింది. తొలిదశ ఎన్నికల్లో బంపర్ ఓటింగ్ జరిగిన తర్వాత పాకిస్థాన్ ఈ ప్రకటన చేసింది. జమ్మూ కాశ్మీర్లోని 24 అసెంబ్లీ స్థానాలకు సెప్టెంబర్ 18న తొలి దశ పోలింగ్ జరిగింది. తొలి దశలో 60 శాతానికి పైగా ఓటింగ్ జరిగింది. ఈ ఓటింగ్ పై పాకిస్థాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ముంతాజ్ జహ్రా బలోచ్ మాట్లాడుతూ భారత్ అక్రమంగా ఆక్రమించిన జమ్మూ కాశ్మీర్లో జరిగిన ఈ ఎన్నికలకు అంతర్జాతీయ స్థాయిలో ఎలాంటి విలువ లేదని అన్నారు. అంతర్జాతీయ చట్టాల దృష్టిలో ఈ ఎన్నికలకు చట్టపరమైన విలువ లేదని భారత్కు గుర్తు చేయాలనుకుంటున్నామని బలూచ్ అన్నారు.

**ఐరాస తీర్మానాన్ని గుర్తు చేస్తున్న పాక్:** ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాన్ని పాక్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి భారత్కు గుర్తు చేశారు. ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణలో రిఫరెండం ద్వారా జమ్మూ కాశ్మీర్ వివాదానికి తుది పరిష్కారం కాశ్మీర్ ప్రజల కోరిక మేరకు జరుగుతుందని ఐక్యరాజ్యసమితి తీర్మానంలో స్పష్టంగా వ్రాయబడిందని బలూచ్ చెప్పారు. దశాబ్దాలుగా ప్రజలు ఆక్రమణలకు గురవుతున్నారన్నారు. కాశ్మీరీ రాజకీయ ఖైదీల సంఖ్య వేలల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

# నక్సలైట్లకు అమిత్ షా డెడ్ లైన్

● మావోయిస్టులు హింస, ఆయుధాలను వదిలేసి లొంగిపోవాలి ● లేదంటే ఆపరేషన్ నిర్వహించి ఏరిపడేస్తాం ● 2026 మార్చి నాటికి నక్సలిజం అంతం చేస్తాం ● బాధితుల కోసం త్వరలోనే సంక్షేమ పథకం ● కేంద్ర హోంమంత్రి అమిత్ షా



ఛత్తీస్గఢ్: ఇటీవల ఛత్తీస్గఢ్ దండకారణ్యంలో మావోయిస్టుల దాడులు పెరిగిపోతున్నాయి. ఈనేపథ్యంలో 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. హింసను వీడి లొంగిపోవాలని మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్గఢ్లో నక్సల్స్ హింసాకాండలో 55 మంది బాధితులను ఉద్దేశించి ఆయన శుక్రవారం ఈమేరకు వ్యాఖ్యానించారు. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయించుకున్నారని అమిత్షా పేర్కొన్నారు. మావోయిస్టులు ఒకప్పుడు పశుపతినాథ్ (నేపాల్) నుంచి తిరుపతి వరకు కారిడార్ ఏర్పాటుచేయాలని భావించారని కానీ, మోడీ నేతృత్వంలో దాన్ని ధ్వంసం చేశామన్నారు. ఈసందర్భంగా హింసను, ఆయుధాలను వదిలేసి లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే మావోయిస్టుల అంతానికి ఆల్- అవుట్ ఆపరేషన్ నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఛత్తీస్గఢ్లోని నాలుగు జిల్లాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా జరిపిన ఆపరేషన్లలో భద్రతా బలగాలు గణనీయమైన విజయాన్ని సాధించారన్నారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో మావోయిస్టుల హింసాకాండ బాధితులకు హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ త్వరలో సంక్షేమ పథకాన్ని రూపొందిస్తుందన్నారు. ఉద్యోగాలు, ఆరోగ్య సంరక్షణతో పాటు సంక్షేమ కార్యక్రమాల ద్వారా బాధితులకు సహాయం అందిస్తామని షా వెల్లడించారు.

## అంబేడ్కర్ మునిమనవడు రాజారత్నం

# కామెంట్స్పై కలకలం

● రాహుల్కు వ్యతిరేకంగా నిరసన తెలపాలని నాపై తీవ్ర ఒత్తిడి చేశారు ● నాకు కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకటే ● నేనెందుకు నిరసన తెలపాలి: రాజారత్నం




ముంబై: అంబేడ్కర్ మునిమనవడు రాజారత్నం కామెంట్స్ దేశంలో దుమారం రేపుతున్నాయి. అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడారని ఎన్డీఏ తీవ్ర విమర్శలు గుప్పించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. రాహుల్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసనలు తెలపాలని బీజేపీ నేతలు తనపై ఒత్తిడి తెచ్చారని రాజారత్నం పేర్కొన్నారు. ఈమేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియోను విడుదల చేశారు. 'రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపేందుకు, ధర్నాలు చేసేందుకు దేశంలోని అతిపెద్ద పార్టీ నన్ను సంప్రదించింది. రెండు రోజులుగా నాపై తీవ్రమైన ఒత్తిడిని తెచ్చింది. కానీ, నేను ఎలాంటి నిరసనలు తెలపాలని అనుకోవడం లేదు.. చేయను కూడా. సమాజం కోసమే నేను సేవ చేస్తున్నాను. వారు మాత్రమే నాకు ఆదేశాలు ఇవ్వగలరు. నన్ను ఆదేశించే హక్కు బీజేపీకి లేదని స్పష్టం చేశారు. బీజేపీనో మరో పార్టీనో చెప్పిన మేరకు నేను నిరసనలు తెలపాల్సిన అవసరం లేదు. నేను రాహుల్ గాంధీ, కాంగ్రెస్ మద్దతుదారుడిని కాదు. నాకు కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకటే. ఈ అంశంపై ఆయన్ను ఎందుకు వ్యతిరేకించాలి? ఏ అంశంపై ఆందోళనలు చేయాలనేది నా వ్యక్తిగత విషయం' అని ఆయన వీడియోలో పేర్కొన్నారు.

# అంతరిక్షంలో సునీతా విలియమ్స్ బర్త్ డే



ఫ్లోరిడా: మూడోసారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సాంకేతిక కారణాల వల్ల రోజుల తరబడి అక్కడే చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. కాగా సెప్టెంబర్ 19న సునీత పుట్టినరోజు. ఈ సందర్భంగా తన 59వ బర్త్డేను ఆమె భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న అంతరిక్ష కేంద్రంలో నిర్వహించుకున్నారు. పుట్టినరోజున ఆమె బిజీ షెడ్యూల్ గడిపారు. తనతోటి వ్యోమగామి విల్మోర్తో కలిసి స్పేస్ స్టేషన్ లైఫ్ సపోర్ట్ సిస్టమ్లను శుభ్రం చేసుకున్నారు. స్మోక్డిటెక్టర్ల పనితీరును పరీక్షించారు. ఇదంతా రొటీన్ పనే అయినప్పటికీ.. ఐఎస్-ఎస్ లో ఉన్నవారి ఆరోగ్యం, భద్రతకు చాలా కీలకమని వ్యోమగాములు చెబుతారు. అనంతరం వారు హ్యూస్టన్లోని మిషన్ కంట్రోల్ సెంటర్లోని డైరెక్టర్లతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ చర్చల్లో భాగంగా వ్యోమగాముల లక్ష్యాలు, చేయాల్సిన పనులు, వివిధ శాస్త్రీయ అధ్యయనాల గురించి మాట్లాడారు. కాగా.. అంతరిక్షంలో బర్త్డే చేసుకోవడం ఆమెకు ఇది రెండోసారి. గతంలో 2012లోనూ ఆమె తన పుట్టినరోజున మిషన్లో భాగంగా ఐఎస్ఎస్లోనే ఉన్నారు. 8 రోజుల మిషన్లో భాగంగా సునీత, విల్మోర్ జూన్ 6న బోయింగ్ స్టార్లైనర్ క్యాప్సుల్లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జూన్ 14వ తేదీన వీరిద్దరూ భూమికి తిరుగుపయనం కావాల్సిఉండగా.. వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ఈ సమస్యను పరిష్కరించిన బోయింగ్.. వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకొచ్చేందుకు స్టార్లైనర్ సురక్షితమే అని చెప్పింది. కానీ, నాసా అందుకు అంగీకరించలేదు. దీంతో స్టార్లైనర్ న్యూ మెక్సికోలోని వైట్ శాండ్స్ స్పేస్ హార్బర్లో సురక్షితంగా కిందకు దిగింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు వీరు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇరువురు వ్యోమగాములు ఇటీవల ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సునీతా మాట్లాడుతూ.."బోయింగ్ మమ్మల్ని విడిచివెళ్లడం కఠిన వ్యవహారంగా అనిపిస్తోంది. దీంతో మరికొన్ని నెలలు కక్ష్యలోనే గడపాల్సి ఉంది. అయినా, అంతరిక్షంలో ఉండటం ఆనందంగా ఉంది. ఇదంతా మా విధుల్లో భాగంగానే భావిస్తున్నాం" అని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను మిస్ అవుతున్నప్పటికీ..ఇక్కడ ఉండటం ఎలాంటి ఇబ్బందికి గురిచేయడం లేదన్నారు.



# ఫ్యాక్ట్ చెక్ యూనిట్ వద్దు

● కేంద్రానికి బాంబే హైకోర్టు షాక్ ● 'ఐటీ సవరణ నిబంధనలు-2023' అమలును నిలిపేసిన హైకోర్టు ● ఆ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధం: బాంబే హైకోర్టు ● కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం

ముంబై : కేంద్ర ప్రభుత్వానికి బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మీడియాలో వచ్చే వార్తలు, సోషల్ మీడియాలో చేసే పోస్టులలోని నిజానిజాలను తనిఖీ చేసేందుకు ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ను ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ యూనిట్ను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి అనుమతినిచ్చే 'ఐటీ సవరణ నిబంధనలు-2023' అమలును ప్రస్తుతానికి నిలుపుదల చేస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. ఆ నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19లకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంటూ న్యాయమూర్తి జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ శుక్రవారం తీర్పును వెలువరించారు. 'ఐటీ సవరణ నిబంధనలు-2023' అమలును సవాల్ చేస్తూ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం తన సోషల్ మీడియా కంటెంట్ను బ్లాక్ చేయడంతో పాటు సోషల్ మీడియా అకౌంట్లను సస్పెండ్/డీయాక్టివేట్ చేయించిందని ఆయన ఆరోపించారు. ఫ్యాక్ట్ చెక్ యూనిట్ల ఏర్పాటు వెనుక ఎలాంటి దురుద్దేశమూ లేదని స్పష్టం చేస్తూ కేంద్ర ప్రభుత్వం హైకోర్టుకు ఓ అఫిడవిట్ను సమర్పించింది. సర్కారుపై కునాల్ కమ్రా చేసిన ఆరోపణలు సరికావని తెలిపింది. దీనిపై విచారణ జరిపిన బాంబే హైకోర్టు తాజా ఆదేశాలను జారీ చేసింది.

**పరిమితికి మించిన శక్తులు పొందే యత్నం:** వాస్తవానికి ఈ అంశంపై 2024 జనవరిలో న్యాయమూర్తులు జస్టిస్ జి.ఎస్.పటేల్, జస్టిస్ నీలా గోఖలేలతో కూడిన ముంబై హైకోర్టు డివిజన్ బెంచ్ స్ప్లిట్ తీర్పును వెలువరించింది. అంటే ఇద్దరు న్యాయమూర్తులు భిన్నమైన తీర్పును ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు అనుమతినిచ్చే 'ఐటీ సవరణ నిబంధనలు-2023' రాజ్యాంగ విరుద్ధమైనవని న్యాయమూర్తి జస్టిస్ జి.ఎస్.పటేల్ పేర్కొనగా.. ఆ నిబంధనలు బాగానే ఉన్నాయని న్యాయమూర్తి జస్టిస్ నీలా గోఖలే అప్పట్లో తెలిపారు. తాజాగా శుక్రవారం రోజు దీనిపై విచారణ జరిపిన బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్.. గతంలో జస్టిస్ జి.ఎస్.పటేల్ వ్యక్తం చేసిన అభిప్రాయంతో తాను ఏకీభవిస్తున్నట్లు చెప్పారు. 'ఐటీ సవరణ నిబంధనలు-2023' ద్వారా పరిమితికి మించిన శక్తులు పొందేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నించిందని ఆయన వ్యాఖ్యానించారు. ముంబై హైకోర్టు ఆదేశాలపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. వాటిపై దేశ సర్వోన్నత న్యాయస్థానం స్టే విధిస్తేనే ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఏర్పాటుకు మళ్లీ తలుపులు తెరుచుకుంటాయని న్యాయనిపుణులు అంటున్నారు. ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, న్యూ బ్రాడ్కాస్ట్ అండ్ డిజిటల్ అసోసియేషన్, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మేగజైన్స్ కూడా ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ముంబై హైకోర్టులో పిటిషన్లు వేశాయి. ఆ విభాగం ఏర్పాటు వల్ల భావన ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలుగుతుందని, సెన్సార్షిప్ హక్కులు ప్రభుత్వం చేతుల్లోకి వెళ్తాయని వాదించాయి. కేంద్ర ప్రభుత్వం గతేడాది ఏప్రిల్ 6న 'ఐటీ సవరణ నిబంధనలు-2021'లో పలు సవరణలు చేసింది. 'ఐటీ సవరణ నిబంధనలు-2023'ను అమల్లోకి తెచ్చింది. తప్పుడు వార్తలు, సోషల్ మీడియాలోని తప్పుదోవ పట్టించే కంటెంట్ను గుర్తించి నిలువరించే లక్ష్యంతో ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలనే అంశాన్ని అందులో ప్రతిపాదించారు.

# బంగ్లాదేశ్లో మరోసారి ఆర్మీ రూల్



ఢాకా: బంగ్లాదేశ్ పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లైంది. రిజర్వేషన్ కోటాకు నిరసగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడంతో షేక్ హసీనా ప్రధాని పదవికీ రాజీనామా చేసి భారత్ పారిపోయి వచ్చింది. నోబెల్ గ్రహీత మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. అయితే, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా అక్కడ మతోన్మాదులు రెచ్చిపోతున్నారు. దేశ అంతర్గత భద్రత తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా లా అండ్ ఆర్డర్ అనేది ఆ దేశంలో లేనే లేదు. నిరసనల సమయంలో పోలీసులు టార్గెట్గా హత్యలు జరగడంతో, విధుల్లో చేరేందుకు వారు సుముఖత చూపించడం లేదు. దీంతో దేశవ్యాప్తంగా అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు నిత్యకృత్యంగా మారాయి. చాలా మందిని బెదిరించి వారి ఆస్తుల్ని రాయించుకోవడం, మైనారిటీలను బెదిరించి ఉద్యోగాలకు రాజీనామా చేసేలా బలవంతం చేయడం లాంటి పనులు కొనసాగుతున్నాయి. ఇక జమాతే ఇస్లామీ, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్పీ) వంటి మతోన్మాద పార్టీలు రెచ్చిపోతున్నాయి. బుర్ఖా? ధరించకుంటే మహిళలపై దాడులు చేస్తున్నారు. ఇతర మతస్తులతో గుంజీలు తీయిస్తున్నారు. ఇలాంటి ఘటనల్ని అదుపు చేయడంతో అక్కడి తాత్కాలిక ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మహ్మద్ యూనస్ శాంతియుతంగా ఉండాలని కోరడం తప్పితే, ఎలాంటి చర్యలు తీసుకోలేని పరిస్థితి ఉంది. దీంతో పరిస్థితి చక్కదిద్దేందుకు ఆర్మీ సాయం కోరారు. పాలన అస్తవ్యస్తంగా మారడంతో మహ్మద్ యూనస్ బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వకార్ ఉద్ జమాన్ కార్యాలయాని వెళ్లి మరీ బంగ్లాదేశ్ అంతర్గత పరిస్థితి గురించి చర్చించారు. ఆర్మీకి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలను కట్టబెట్టింది. ఈ అంశానికి సంబంధించి బంగ్లాదేశ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ను విడుదల చేసింది. రాబోయే 60 రోజుల పాటు దేశంలో అంతటా జిల్లా మేజిస్ట్రేట్ పర్యవేక్షణలో ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లుగా పని చేయనున్నారు. ఈ పవర్స్ ద్వారా ఆర్మీ ప్రజలను అరెస్ట్ చేయడం, నిర్బంధించడం, అల్లర్లని అణిచివేయడానికి కాల్పులు జరడపడం వంటి అధికారాలను కలిగి ఉంటుంది.

# స్టార్ హెల్త్ కస్టమర్ల డేటా చోరీ

● టెలిగ్రామ్లో అమ్మకానికి కస్టమర్ల వ్యక్తిగత సమాచారం ● సెక్యూరిటీ రీసెర్చర్కు తెలిపిన చాట్ బాట్ సృష్టికర్త మీడియా దృష్టికి తీసుకెళ్లిన రీసెర్చర్ ● గత నెలలో పారిస్లో టెలిగ్రామ్ ఫౌండర్, సీఈవో పావెల్ దురోవ్ అరెస్ట్



పారిస్: భారత్లో దిగ్గజ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ అయిన 'స్టార్ హెల్త్' కంపెనీ నుంచి భారీ సంఖ్యలో కస్టమర్ల డేటా చోరీకి గురైనట్లు తెలుస్తోంది. లక్షలాది కస్టమర్ల సమాచారాన్ని బహిరంగంగా విక్రయానికి పెట్టినట్లు తెలుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇందులో కస్టమర్ల మెడికల్ రిపోర్టులతోపాటు సున్నితమైన సమాచారం ఉంది. టెలిగ్రామ్లోని చాట్బాట్స్ ద్వారా స్టార్ హెల్త్ సమాచారం అందుబాటులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ యాప్లో నేరాలకు అనుమతిస్తున్నట్లు టెలిగ్రామ్ వ్యవస్థాపకుడిపై ఆరోపణలు వచ్చిన కొద్ది రోజుల్లోనే తాజా వ్యవహారం వెలుగుచూడటం గమనార్హం. ఈ విషయాన్ని చాట్బాట్ సృష్టికర్త ఓ సెక్యూరిటీ రీసెర్చర్కు చెప్పగా.. అతడు అంశాన్ని మీడియా దృష్టికి తీసుకువచ్చాడు. మిలియన్ల కొద్దీ కస్టమర్ల వ్యక్తిగత సమాచారాన్ని అమ్మకానికి పెట్టినట్లు.. చాట్బాట్లను అడగడం ద్వారా వినియోగదారుల సమాచారాన్ని చూడవచ్చని చెప్పాడు. ఈ విషయంపై స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ సంస్థ స్పందించింది. అనధికార డేటా యాక్సెస్ ఆరోపణలకు సంబంధించి స్థానిక అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపింది. ఇలాంటి విషయాల్లో ఎలాంటి రాజీ లేదని.. సున్నితమైన కస్టమర్ల డేటా సురక్షితంగా ఉంటుందని స్పష్టంచేసింది. మరోవైపు చాట్బాట్లను ఉపయోగించి పాలసీ, క్లెయిమ్ డాక్యుమెంట్లను డౌన్లోడ్ చేసుకోవచ్చని ఆ మీడియా సంస్థ తెలిపింది. కస్టమర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాలు, ట్యాక్స్ సమాచారం, ఐడీ కార్డులు, టెస్టుల ఫలితాలలాంటి సమాచారాన్ని పొందవచ్చని చెప్పింది. టెలిగ్రామ్ ఫౌండర్, సీఈవో పావెల్ దురోవ్ ను పారిస్లో పోలీసులు గత నెలలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అజర్బైజాన్ నుంచి లే బోర్గెట్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన్ను కస్టడీలోకి తీసుకున్నారు. మోసం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాల్ని ప్రోత్సహించడం వంటి ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. అప్పటినుంచి టెలిగ్రామ్ కంటెంట్పై పరిశీలన పెరిగింది. ఈనేపథ్యంలోనే స్టార్ హెల్త్ కస్టమర్ల డేటా వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

# వెంటనే కులగణన చేపట్టాలి

తెలంగాణ బ్యూరోప్రతినిధిః వెంటనే కులగణన చేపట్టి, పంచాయతీ రాజ్ /సర్పంచ్ / ఎంపీటీసీ / జడ్పిటిసి తదితర స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం కు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. , గత మూడు సంవత్సరాల ఫీజుల బకాయిలు 4500 చెల్లించాలని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ చలో కలెక్టరేట్ పిలుపులో భాగంగా హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంను ముట్టడించారు. ఈ ముట్టడికి బి.సి సంఘాల కార్యకర్తలు పెద్ద యెత్తున పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల ముట్టడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్న ఇంతవరకు కులగణన చేయడం లేదనీ, ఎన్నికల వాగ్దానం ప్రకారం బీసీ రిజర్వేషన్లను 42 శాతంకు పెంచడం లేదు. రాహుల్ గాంధీ ఇచ్చిన వాగ్దానం నెరవేర్చరా? దిక్కరిస్తారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల వాగ్దానం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం పంచాయతీరాజ్ మున్సిపల్ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం కు పెంచాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ బీసీల గురించి అనుకూలంగా మాట్లాడుతున్నారు. కానీ ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు పెంపు గురించి మాట్లాడలేదు అణిచివేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ వాగ్దానాలను అమలు చేయడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50శాతం సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవడానికి వీలులేదు. ఇప్పటికి అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టి 50 శాతం సీలింగ్ పై పార్లమెంటు రాజ్యాంగ సవరణ చేసింది.



# అది ఫోర్త్ సిటీ కాదు అది ఫోర్ బ్రదర్స్

● రేవంత్ సర్కార్ పేదల భూములపై కన్నేసింది ● ఫోర్త్ సిటీ మాటున వేల ఎకరాలు గుంజుకునేందుకు కసరత్తు మొదలు పెట్టింది ● అడ్డగోలు అలైన్‌మెంట్‌తో.. పేదల అనుమతి లేకుండా... వారి భూములను స్వాధీనం చేసుకునేందుకు కుట్ర

● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా



తెలంగాణ బ్యూరోప్రతినిధి: ఫ్యూచర్ సిటీ.. ఫోర్త్ సిటీ పేరిట రేవంత్ సర్కార్ పేదల భూములపై కన్నేసింది. ఫోర్త్ సిటీ మాటున వేల ఎకరాలు గుంజుకునేందుకు కసరత్తు మొదలు పెట్టింది కాంగ్రెస్ సర్కార్. అడ్డగోలు అలైన్‌మెంట్‌తో.. పేదల అనుమతి లేకుండా%ౌ% వారి భూములను స్వాధీనం చేసుకునేందుకు రేవంత్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి తీరుపై బాధిత గ్రామాల ప్రజలు, రైతులు కన్నెర్ర జేస్తున్నారు. అయితే రంగారెడ్డి జిల్లా వెల్దండ, మాడ్గుల మండలాల్లోని కుందారం భూములపై అరాచకకాండ రాజ్యమేలుతున్నదని ఒక దినపత్రిక ఒక ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ కథనాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. అది ఫోర్త్ సిటీ కాదు.. అది ఫోర్ బ్రదర్స్ సిటీ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రియల్ ఎస్టేట్ మాఫియా అనే హ్యాష్ ట్యాగ్ జతపరిచారు కేటీఆర్. మారిన ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌తో లబ్ధి పొందేందుకు వీలుగా 400 ఎకరాలను చెరపట్టడమే లక్ష్యంగా దళారీ దందా సాగుతున్నది. ఓ కీలకనేత సోదరులు, సంబంధీకులూ వీరిలో ఉన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 'భూములిస్తారా.. మేమే లాక్కోవాలా?' అని రైతులను బెదిరించి ఇప్పటికే అడ్డికి పావుసేరుగా వంద ఎకరాలు కొనేశారు. 'కబ్జా స్వాధీనపత్రం' అంటూ ప్రపంచంలో ఎక్కడా లేని పత్రాలపై సంతకాలు చేయించుకుని ప్రైవేటు ఒప్పందాలు చేసుకుంటున్నారు. నయీం అనుచరులను దింపి మాట వినని రైతులను బెదిరిస్తున్నారు. అజలాపురం నుంచి కుందారం తండా దాక ఇదే భయానక వాతావరణం! కుందారం భూములపై కన్నేసిన 'బిగ్-బ్రదర్స్' వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఇందులో భాగంగానే ఒకవైపు ట్రిపుల్-ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో మార్పు చేశారు. దీంతోపాటు ఆమనగల్-రావిర్యాల గ్రీన్‌ఫీల్డ్ 300 ఫీట్ల రహదారిని కూడా దీనికి సమీపంలోనే ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో మరోవైపు కొందరు వ్యక్తులను రంగంలోకి దింపి పెద్దఎత్తున భూములను కొనుగోలు చేస్తున్నారు. ఇందులోనే నయీం అనుచరులు కీలకపాత్ర పోషిస్తున్నట్టు గ్రామస్తులు కొందరు తెలిపారు. ముఖ్యంగా ఓఆర్సీ, పాసు పుస్తకాలు లేకుండా కబ్జాలో ఉన్న రైతులను ముందుగా టార్గెట్ చేశారు. 'ఎలాగూ మీకు డాక్యుమెంట్లు లేవు%ౌ% ఎంతోకొంతకు అమ్ముకుంటే ఇప్పుడు పైసలొస్తయి. లేదంటే భూమి నుంచి వెళ్లగొడ్తరు. మేం ఎలాగోలా సీసీఎల్ఏలో రికార్డుల్లో నమోదు చేసుకుంటాం' అని చెప్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. భూములియ్యబోమని మొండికేసినవారిని బెదిరిస్తున్నారు. వాస్తవానికి ఇక్కడ ఎకరా రూ.30 లక్షల నుంచి 40 లక్షల వరకు ధర పలుకుతుండగా%ౌ% కేవలం రూ.3-4 లక్షలకే కొనుగోలు చేసుకొని, ప్రైవేటు ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఆపై ఓఆర్సీ ఉండి, భూమిపై ఉన్న వారిని కూడా బెదిరిస్తున్నారు. రికార్డుల్లో తక్కువ ఉండి, కబ్జాలో ఎక్కువ ఉన్నందున మొత్తానికి ఒక రేటు నిర్ధారించి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు వందెకరాలకు పైగా భూమిని ఇలా కొనుగోలు చేసినట్టు సమాచారం. అయితే ఓఆర్సీ ఉండి పాసు పుస్తకాలు లేకుండా, కబ్జా మీద లేనివారు ఇప్పుడు వీరిచుట్టూ తిరుగుతున్నారు. మాకు ఓఆర్సీ ఉంది.. పైసలు మాకియ్యాలి అంటూ వేడుకున్నా కనికరించడంలేదని కొందరు రైతులు 'ఆవేదన వ్యక్తంచేశారని తెలిపారు.

**కౌలు రైతుకు భరోసా ఇవ్వలేమని చేతులెత్తేస్తారా..?**

రైతులకు, కౌలురైతులకు ఇద్దరికీ రైతుభరోసా ఇస్తామంటూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ఒట్టిదేనని తేలిపోయింది. ఇద్దరికీ ఇవ్వడం కుదరదని, ఎవరో ఒకరికి మాత్రమే రైతుభరోసా ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుండబద్దలు కొట్టిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఓడ దాటేదాక ఓడ మల్లన్న, ఓడ దాటకా బోడి మల్లన్న అన్నటుంది కాంగ్రెస్ పాలనా అని తీవ్రంగా విమర్శించారు. అరచేతిలో బెల్లం పెట్టి మోచేతిని నాకిస్తున్నారు ఇప్పుడు. రైతు భరోసా, రుణమాఫీ పై ఎన్నికల వేల బీరాలు పలికి ముఖ్యమంత్రి ఇప్పుడు నేల చూపులు చూస్తున్నాడని ధ్వజమెత్తారు కేటీఆర్. మంత్రి తుమ్మల వ్యాఖ్యలతో కౌలు రైతులు అయోమయం.. తాజాగా రైతు భరోసాపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఢిల్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రైతన్నలను అయోమయానికి గురిచేస్తున్నాయి. కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వలేమని కుండా బద్దలు కొట్టాడు. కౌలు రైతులను నమ్మించి తడి గుడ్డతో గొంతు కోసింది కాంగ్రెస్ ప్రభుత్వం. మొన్న రుణమాఫీ పేరిట మోసం చేశారు. నిన్న వానాకాలం పెట్టుబడి సాయం ఎగ్గొట్టారు. నేడు కౌలు రైతుకు భరోసా ఇవ్వలేమని చేతులెత్తేస్తారా..? అంటూ కాంగ్రెస్ సర్కార్‌ను కేటీఆర్ కడిగి పారేశారు.

**గద్దెనెక్కాక గొంతు కోసిన వారిని అస్సలు వదిలిపెట్టరు** కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిందేంటి..? చేస్తున్నదేంటి..? 420 హామీల్లో ఒక్కో వాగ్దానాన్ని సీఎం పాతరేస్తున్నారు..? చేతకానప్పుడు హామీలు ఇవ్వడమెందుకు..? అధికారంలోకి రాగానే మాటతప్పడమెందుకు..? ఇది ముమ్మాటికీ మోసం.. నయవంచన.. తెలంగాణ రైతులు దేన్నైనా క్షమిస్తారు కానీ%ౌ%నమ్మించి ద్రోహం చేస్తే ఎట్టిపరిస్థితుల్లో క్షమించరు. గద్దెనెక్కాక గొంతు కోసిన వారిని అస్సలు వదిలిపెట్టరు. ఈ వెన్నుపోటుకు ముఖ్యమంత్రి మూల్యం చెల్లించుకోక తప్పదు అని కేటీఆర్ హెచ్చరించారు

# నేడే కొండా లక్ష్మణ్ బాపూజీ 12 వర్ధంతి

● ఘనంగా నిర్వహించేందుకు బీసీ సంఘం నిర్ణయం



తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12 వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాచిగూడలోని హెూటల్ అభినందన్‌లో ఉదయం గం.10లకు వర్ధింతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హాజరవుతున్నారని తెలిపారు. సాధించుకున్న భౌగోళిక తెలంగాణను సామాజిక తెలంగాణ ఆవిష్కరించే దిశగా పయనిద్దామని పిలుపునిచ్చారు. కొండా లక్ష్మణ్ ఆశయ సాధనకై నడుం బిగిద్దామన్నారు. ఈ కార్యక్రమానికి బీసీ సంఘాల నేతలతో పాటు ఆయన ఆత్మీయులు పెద్ద ఎత్తున తరలి రావాలని గుజ్జ సత్యం పిలుపునిచ్చారు.

# కాళేశ్వరం కొట్టుకపోతే మల్లన్నసాగర్‌కు నీళ్లు ఎట్లొచ్చినయ్..?



తెలంగాణ బ్యూరోప్రతినిధిః కాళేశ్వరం డిజైనింగ్ సరిగా లేదని, అందుకే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై బీఆర్ఎస్ పార్టీ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి మండిపడ్డారు. నిండుకుండలా ఉన్న మల్లన్న సాగర్‌ను చూస్తుంటే తనకు కడుపు నిండిన అనుభూతి కలుగుతున్నదని ఆయన అన్నారు. మల్లన్న సాగర్ నిండుగా ఒక సముద్రంలా కనబడుతున్నదని ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. కాళేశ్వరం కొట్టుకపోయిందని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నిజంగా కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకపోతే మల్లన్న సాగర్‌లోకి 21 టీఎంసీల నీళ్లు ఎట్ల వచ్చినయని ఆయన ప్రశ్నించారు. కాగా మల్లన్నసాగర్ జలాశయాన్ని చూసేందుకు వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావును, ఇతర బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు

# జలవిహార్‌పై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదు



● డైరెక్టర్ విజయ్ ఆదిత్య రాజు

తెలంగాణ బ్యూరోప్రతినిధిః కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేశారని, జలవిహార్ వ్యర్థాలు అన్ని హుస్సేన్ సాగర్‌లోకే అంటూ వస్తున్న ఆరోపణలపై జలవిహార్ డైరెక్టర్ విజయ్ ఆదిత్య రాజు స్పందించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జలవిహార్ పై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని అన్నారు. ప్రభుత్వం ప్రత్యేక జీవో ద్వారా తమకు 12.5 ఎకరాల స్థలానికి కేటాయించిందని.. అందులోనే వాటర్ పార్కును ఏర్పాటు చేశామని వెల్లడించారు. తమకు భూమిని కేటాయించిన తర్వాత కోర్టు కేసుతో ఆలస్యంగా 2007 నుంచి యాక్టివిటీ ప్రారంభించామని తెలిపారు. హెచ్ఎండీఏ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఇక్కడ ఆక్టివిటీ జరుగుతుందని జలవిహార్ డైరెక్టర్ పేర్కొన్నారు. "మా కంపెనీకి ప్రతిష్టను దెబ్బ తీసే విధంగా కొంతమంది వ్యక్తులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు.. ఇప్పుడు ఫిర్యాదు చేసిన వాళ్లకు కూడా పూర్తి వివరాలు తెలియకపోయి ఉండవచ్చు.. వారు కూడా వచ్చి ఇక్కడ జరుగుతున్న ఆక్టివిటీని చెక్ చేసుకోవచ్చు.. హైడ్రా ప్రభుత్వ విభాగం కాబట్టి వారు వచ్చి ఎలాంటి పరిశీలనలు చేసిన మేము పూర్తిగా సహకరిస్తాం.. ఇక్కడ ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను హుస్సేన్ సాగర్‌లో కలపడం లేదు. సీవేజ్ ట్రీట్మెంట్ చేసి వాటర్ బోర్డ్ లైన్ లో కలుపుతున్నాం. చెత్తను కూడా సరైన పద్ధతిలో డిస్పోస్ చేస్తూ వాటన్నింటికీ ఫీజులు చెల్లిస్తున్నాం.. ఇక్కడ జరిగిన నిర్మాణాలు కూడా హెచ్ఎండీఏ అనుమతుల మేరకు మాత్రమే చేపట్టాం. ప్రభుత్వానికి ఎలాంటి బకాయిలు లేవు అన్ని సక్రమంగా చెల్లిస్తున్నాం. మొదటి దశలో ఐదేళ్లు ఆలస్యం అయిన అంశం మాత్రమే పెండింగ్లో ఉంది" అంటూ జలవిహార్ డైరెక్టర్ విజయ్ ఆదిత్య రాజ్ స్పష్టం చేశారు.

**హైడ్రా ఫోకస్..** మరోవైపు హుస్సేన్ సాగర్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై హైడ్రా బుల్డోజర్ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన థ్రిల్ సిటీ, జలవిహార్ పై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జలవిహార్‌ను కూల్చివేయాలంటూ హైడ్రాకు సీపీఐ జాతీయ నేత, మాజీ ఎంపీ అజీజ్ పాషా ఫిర్యాదు చేశారు. హుస్సేన్‌సాగర్‌ను కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేపట్టిన జలవిహార్ పై చర్యలు తీసుకోవాలంటు డిమాండ్‌లు భారీగా వినిపిస్తున్నాయి. జలవిహార్ ఆక్రమణకు సంబంధించిన పూర్తి వివరాలను హైడ్రా కమిషనర్‌కు సీపీఐ నేతలు అందజేశారు. హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో 12.5 ఎకరాల్లో జలవిహార్ ఏర్పాటు అయ్యింది. హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధి జలవిహార్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఫోరమ్ ఫర్ బెటర్ హైదరాబాద్ కోర్టును ఆశ్రయించింది. 2007 లో జలవిహార్ ప్రారంభమైంది. జలవిహార్‌కు అప్పటి ప్రభుత్వం 30 ఏళ్ళు లీజ్‌కు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. జలవిహార్‌లో వాటర్ పార్క్, ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి. సందర్శకుల ద్వారా వచ్చే డబ్బులు, ఫంక్షన్ హాల్స్ ద్వారా కోట్ల రూపాయలను జలవిహార్ అర్జిస్తోంది. జలవిహార్ వ్యర్థాలు అన్ని హుస్సేన్ సాగర్‌లోకే వెళతాయి. ఈ క్రమంలో జలవిహార్‌కు సంబంధించి ఫిర్యాదుల వెల్లువెత్తిన నేపథ్యంగా హైడ్రా నెక్స్ట్ టార్గెట్‌గా జలవిహారం నిలిచింది

# కాళేశ్వరం కమిషన్ ముందుకు తెలంగాణ రిసెర్చ్ అధికారులు



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణ రిసెర్చ్ అధికారులు కాళేశ్వరం కమిషన్ ముందు హాజరయ్యారు. జాయింట్ డైరెక్టర్ తోపాటు చీఫ్ ఇంజినీర్, ఇతర ఇంజనీర్లు కమిషన్ ముందు హాజరైన వారిలో ఉన్నారు. మూడు బ్యారేజీల కంటే ముందు మోడల్ స్టడీస్ కండక్ట్ చేశారా లేదా..? అని ఈ సందర్భంగా రిసెర్చ్ ఇంజినీర్లను కమిషన్ ప్రశ్నించింది. కన్స్ట్రక్షన్‌కు ముందు, మధ్యలో, తర్వాత కూడా మోడల్స్ నిర్వహించినట్లు రిసెర్చ్ ఇంజినీర్‌లు తెలిపారు. మోడల్ స్టడీస్ పూర్తికాకముందే కన్‌స్ట్రక్షన్ మొదలైనట్లు కమిషన్ ముందు రిసెర్చ్ ఇంజినీర్లు ఒప్పుకున్నారు. మేడిగడ్డతో పాటు ఇతర డ్యామేజ్ జరగడానికి కారణం నీళ్లను స్టోరేజ్ చేయడమేనని కమిషన్ ముందు రిసెర్చ్ ఇంజనీర్లు చెప్పారు. వరద ఎక్కువగా వచ్చినప్పుడు గేట్లను ఎత్తకుండా ఫీల్డ్ అధికారులు నిర్లక్ష్యం వహించారని తెలిపారు. మోడల్ స్టడీస్ తర్వాత బఫెల్ బ్లాక్‌లో మార్పులు, సవరణలు చేయడానికి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని చెప్పారు. బ్యారేజీలు డామేజ్ అవ్వడానికి, మోడల్ స్టడీస్‌కు సంబంధం లేదని రిసెర్చ్ అధికారులు కమిషన్‌కు చెప్పారు. మూడు బ్యారేజీల్లో నీళ్లు నిలువ చేయడానికి ఎవరి ఆదేశాలు ఉన్నాయని..? రిసెర్చ్ ఇంజనీర్లను కాలేశ్వరం కమిషన్ ప్రశ్నించింది. అన్నారం బ్యారేజీ నిర్మాణం చేసే లొకేషన్ మారినట్లు రిసెర్చ్ ఇంజనీర్ల దృష్టిలో ఉందా..? అని అడిగింది. ఈ సందర్భంగా నిబంధనల ప్రకారమే టీఎస్ ఈఆర్ఎల్ పని చేసిందని కమిషన్ ముందు ఇంజనీర్లు చెప్పారు. లొకేషన్, సీడీవో అథారిటీ రిపోర్ట్స్ ఆధారంగా రిసెర్చ్ చేశామని అధికారులు పేర్కొన్నారు. మొత్తం మూడు బ్యారేజీల్లో 2016 నుంచి 2023 వరకు మోడల్ స్టడీస్.. రిసెర్చ్ టీమ్ ఆధ్వర్యంలో జరిగినట్లు అధికారులు తెలిపారు. ఒకవైపు నిర్మాణం జరుగుతుండగానే మరొక వైపు రిసెర్చ్ కొనసాగుతుందని ఇంజనీర్‌లు చెప్పారు.


# త్వరలో టీపీసీసీ కమిటీ భర్తీ



తెలంగాణ బ్యూరోప్రతినిధిః త్వరలో ప్రకటించే ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో తమకు అవకాశం కోసం నేతలు పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్ష పదవి తర్వాత కాంగ్రెస్‌లో ప్రాధాన్యత గల వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల కోసం నేత లు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఈ క్రమంలోనే ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ అదేవిధంగా పీసీసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ తో నేతలు లాబీయింగ్ చేస్తున్నారట. తాజగా మహిళ కోటాలో తనకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కోసం దివంగత నేత పీజేఆర్ కూతురు విజయా రెడ్డి పోటీ పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ బలం పెంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. మరొక వైపు త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ పీఠంపై ఎలాగైనా పాగా వేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని గ్రేటర్‌లో బలోపేతం చేయాలని కాంగ్రెస్ గట్టి పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలోనే చేరికలపై దృష్టి సారించింది కాంగ్రెస్. ఆ కోణంలోనే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చారు. మరి కొందరిని కూడా రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి, పార్టీ పదవుల విషయంలో ఈసారి గ్రేటర్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ భావిస్తోంది. అందుకే పీసీసీ కమిటీలో గ్రేటర్ లోని నేతలకు అవకాశం ఇవ్వాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో పీజేఆర్ కూతురు విజయా రెడ్డికి మహిళా కోటాలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇస్తే, కాంగ్రెస్ బలం పుంజుకునే అవకాశం ఉందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక వేళ విజయారెడ్డి కి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తే, పీజేఆర్‌కు ఉన్న ఇమేజ్ కూడా కలిసి వస్తుందని హై కమాండ్ భావిస్తోందట. మరి హై కమాండ్ అనుకున్నట్లు గ్రేటర్ హైదరాబాద్‌కు ప్రాధాన్యత ఇస్తే కాంగ్రెస్ బలం పుంజుకుంటుందా, పీజేఆర్ కూతురు విజయా రెడ్డి కి వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తే బీజేఆర్‌కు ఉన్న ఇమేజ్ తో గ్రేటర్ లో ఏ మేరకు ప్రభావం చూపుతుంది, మరి కాంగ్రెస్ మంత్రం వర్కౌట్ అవుతుందా మరి మహిళ కోటాలో విజయా రెడ్డికి వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ దక్కుతుందా అనేది ఈ నెలాఖరు వరకు ఆగాల్సిందే.

# సీబీఐ విచారణ జరిపించండి

● శ్రీవారి ప్రసాదం వివాదం పై ఆందోళన ● ఏపీ సీఎంకు బండి సంజయ్ లేఖ



తెలంగాణ బ్యూరోప్రతినిధి: ఏపీ సీఎంకు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లేఖ రాశారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు వినియోగం తీవ్ర ఆందోళన గురి చేసిందన్నారు. శ్రీవారి భక్త కోటిని, యావత్ ప్రపంచంలోని హిందువుల మనోభావాలను తీవ్రంగా కలిచి వేస్తోందన్నారు. శ్రీవారి పవిత్రతను దెబ్బతీశారని, అన్యమత ప్రచారం జరుగుతోందని గతంలో ఫిర్యాదులు వచ్చినా గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఎర్రచందనం కొల్లగొడుతూ ఏడు కొండలవాడిని రెండు కొండలకే పరిమితం చేశారని చెప్పినా స్పందించలేదని తెలిపారు. 'జంతువుల కొవ్వును లడ్డూ ప్రసాదంలో వినియోగించారని మీరు (చంద్రబాబు) చేసిన వ్యాఖ్యలతో లడ్డూ ప్రసాదంలో కల్తీ నిజమేనని యావత్ హిందూ సమాజం భావిస్తోందన్నారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును వినియోగించడం అత్యంత నీచమని తెలిపారు. హిందూ ధర్మంపై దాడికి భారీ కుట్ర జరిగినట్లుగానే భావిస్తున్నామన్నారు. లడ్డూ ప్రాముఖ్యతను తగ్గించడానికి, టీటీడీపై కోట్లాది మంది భక్తులకు ఉన్న విశ్వాసాన్ని సడలించేందుకు ఈ కుట్ర చేశారన్నారు. క్షమించరాని నేరానికి ఒడిగట్టారన్నారు. అన్యమతస్తులకు టీటీడీ పగ్గాలు అప్పగించడం, అన్యమతస్తులకు ఉద్యోగాల్లో అవకాశం కల్పించడంవల్లే ఈ దుస్థితి అని తెలిపారు. ఉన్నతస్థాయి వ్యక్తుల ప్రమేయం లేనిదే ఏళ్ల తరబడి ఈ కల్తీ దందా జరిగే అవకాశం లేదన్నారు. సీబీఐతో విచారణ జరిపిస్తేనే సమగ్ర దర్యాప్తు జరిగి వాస్తవాలు నిగ్గు తేలే అవకాశముందన్నారు. ఈ విషయంలో అంతిమ నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదే అని తెలిపారు. రాజకీయ ప్రయోజనాలను పూర్తిగా పక్కనపెట్టి హిందువుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తక్షణమే సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోండి అని తెలిపారు. హిందూ ధార్మిక క్షేత్రంలో అన్యమత ప్రచారం కూడా పూర్తిగా నిషిద్ధం అని తెలిపారు. దేవుడిపై నమ్మకం లేని నాస్తికులకు, అన్యమతస్తులకు టీటీడీ పగ్గాలు అప్పగించడంవల్లే తిరుమల కొండపై అన్యమత ప్రచారానికి ఆస్కారం ఏర్పడుతోందన్నారు. అన్యమతస్తులకు టీటీడీ పగ్గాలు అప్పగించకుండా, అన్యమతస్తులకు టీటీడీలో ఉద్యోగాలివ్వకుండా కఠినమైన చట్టాలు తీసుకురండి అని అన్నారు. తిరుమల కొండ పవిత్రతపై, లడ్డూ ప్రసాదాలపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయండి అని తెలిపారు

# చవకబారు విమర్శలు మానుకోవాలి



తెలంగాణ బ్యూరోప్రతినిధిః బీఆర్ఎస్ నేతలు ఇకనైనా ఇలాంటి చవకబారు విమర్శలు మానుకోవాలని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ట్విట్టర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ స్కీమ్లను పదేండ్లు భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్, ఇప్పుడు నీతులు చెప్పేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. హాస్పిటళ్లకు బకాయిలు విడుదల చేయకుండా, ప్యాకేజీల రేట్లు రివైజ్ చేయకుండా ఆరోగ్యశ్రీ పేషెంట్లకు వైద్యం అందకుండా చేశారన్నారు. ఈహెచ్ఎస్ కింద ట్రీట్మెంట్ కోసం పోయిన ఉద్యోగులు, పెన్షనర్లను కార్పొరేట్ హాస్పిటళ్ల యాజమాన్యాలు అవమానిస్తుంటే చోద్యం చూశారన్నారు. మా వేతనాల్లో నుంచి కంట్రిబ్యూషన్ ఇస్తాం, స్కీమ్ను సమర్థవంతంగా అమలు చేయండని ఉద్యోగులు, పెన్షనర్లు కోరినా పట్టించుకోలేదని తెలిపారు

# కష్టాన్ని నమ్ముకుని.. మంత్రి గా సేవలందిస్తున్న

● మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది

● తెలంగాణ 10వ వార్షిక లీడర్‌షిప్ సదస్సును పారంభించిన సీతక్క




తెలంగాణ బ్యూరోప్రతినిధిఃఎవరి మీద ఆధారపడకుండా కష్టాన్ని నమ్ముకున్నా. మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యి మంత్రిగా సేవలందిస్తున్న అని మంత్రి సీతక్క అన్నారు. మాదాపూర్ లోని టెక్ మహీంద్రా క్యాంపస్ లో సీఐఐ ఇండియన్ వుమెన్ నెట్‌వర్క్ తెలంగాణ 10వ వార్షిక లీడర్‌షిప్ సదస్సును సీతక్క ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళలు సమాజ సృష్టికర్తలు అన్నారు. కానీ మహిళలను చిన్నచూపు చూసే మెంటాలిటీ ఉందన్నారు. అందుకే మహిళలు ఇంకా వెనకబడే ఉన్నారన్నారు. ఎన్నో రంగాల్లో మహిళలు రాణిస్తున్న ..పురుషులే గొప్ప అనే భావన ఉందన్నారు. తక్కువ అనే ఆలోచన నుండి మహిళలు బయటపడాలన్నారు. ఎవరి మీద ఆధారపడకుండా కష్టాన్ని నమ్ముకుని పనిచేసానని తెలిపారు. మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యి మంత్రిగా సేవలందిస్తున్నా అన్నారు. ఆదివాసి మహిళకు పంచాయతీరాజ్ వంటి వంటి పెద్ద శాఖను నాకు ఇచ్చారని తెలిపారు. 13 వేల గ్రామపంచాయతీలు, రెండు కోట్ల మంది ప్రజలకు సేవ చేసే బాధ్యతను నాకు అప్పచెప్పారని తెలిపారు. బాధ్యతలు స్వీకరించి పట్టుదలతో పనిచేస్తున్న అన్నారు. పని ప్రాంతాల్లో మహిళలకు భద్రత కల్పించాలన్నారు. వర్క్ ప్లేస్ లో మహిళలకు భద్రత లేకపోతే ఇంకెక్కడ భద్రత ఉంటుందన్నారు. ఏమైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే ప్రశ్నించడం నేర్చుకోవాలని తెలిపారు. మీకు ఎదురవుతున్న సవాళ్లను మా దృష్టికి తీసుకొస్తే పరిష్కారం కోసం చట్టాలు చేస్తామన్నారు. పని ప్రాంతాల్లో మహిళల మీద వేధింపులను సహించేది లేదన్నారు. వ్యాపారాలు, వ్యాపారవేత్తలు పట్టణాలకే పరిమితం కాకూడదన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పారిశ్రామికవేత్తలు ఎదిగినప్పుడే సమాజంలో అంతరాలు తగ్గుతాయన్నారు. అభివృద్ధి ఒకే చోట కాకుండా అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. ఒక గ్రామీణ బిడ్డగా నేను అదే కోరుకుంటున్నా అని తెలిపారు. స్థానిక వనరుల కేంద్రంగా వ్యాపార అభివృద్ధి జరగాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కోసం సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు దృష్టి పెట్టారన్నారు. గ్రామీణ ప్రాంతాలకు ఐటీని విస్తరిస్తున్నారని.. సవాళ్లు ఎదురైనప్పుడు పారిపోకూడదన్నారు. సవాళ్లను చాలెంజ్ గా తీసుకొని మహిళలు నిలదిక్కుకోవాలన్నారు. మహిళా భద్రత, సాధికారత కోసం మా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను మా ప్రభుత్వ%శీ% ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు. ప్రయాణాలు, పని ప్రాంతాల్లో మహిళా భద్రత కోసం టి సేఫ్ యాప్ తీసుకొచ్చామన్నారు. ఇతర రాష్ట్రాలకు టి సేఫ్ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. లింగ సమానత్వం రావాలంటే అన్నిచోట్ల మహిళలు ముందుకు రావాలన్నారు. మహిళలపై ఎలాంటి వివక్షత చూపకుండా సమాన అవకాశాలు కల్పించాలన్నారు. మహిళలను %బజూశ్రీఅట్% చేసే విధంగా అంతా పనిచేయాలన్నారు. పారిశ్రామిక రంగంలో ముందంజలో ఉన్న మహిళలు, వెనుకబాటుతనంలో ఉన్న మహిళలకు తోడ్పాటు ఇవ్వాలని తెలిపారు. అప్పుడే మహిళాలు అభివృద్ధి బాటలో పరిగెత్తగలరని..మహిళలకు మానవత్వం ఎక్కువ అని తెలిపారు. సమస్యల్లో ఉన్నవారికి అక్కలా చెల్లెలా తల్లిలా చేయూత నివాలన్నారు. యంగ్ ఇండియాలో నిరుద్యోగము పెద్ద సమస్య గా మారిందన్నారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అంకిత భవంతో మీ సేవలను అందించాలని.. ఒకరికొకరు ఆసరాగా ఉండి తెలంగాణను అభివృద్ధి చేసుకుందామన్నారు


# ఆర్టీసీ బస్సుల్లో క్యూఆర్ కోడ్ పేమెంట్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఇకపై బస్ టిక్కెట్‌లకు క్యూఆర్ కోడ్ చెల్లింపులను ఆమోదించనున్నట్లు ప్రకటించింది. ఈ చర్య ప్రయాణీకుల సౌకర్యాన్ని మెరుగుపరచడం , చెల్లింపు ప్రక్రియను క్రమబద్ధీకరించడం లక్ష్యంగా పెట్టుకుంది. నివేదికల ప్రకారం, ఫోన్ పే, గూగుల్ పే, క్రెడిట్ , డెబిట్ కార్డ్‌లతో సహా వివిధ డిజిటల్ చెల్లింపు పద్ధతులను అనుమతించే వ్యవస్థను అమలు చేయాలని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశించారు. ప్రయాణీకులు వారి మొబైల్ పరికరాల నుండి నేరుగా చెల్లింపులు చేయడానికి క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయగలరు, ఇది త్వరిత , సమర్థవంతమైన టికెటింగ్ అనుభవాన్ని నిర్ధారిస్తుంది. ఈ చొరవ డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి , నగదుపై ఆధారపడటాన్ని తగ్గించడానికి టీఎస్ఆర్టీసీ యొక్క ప్రయత్నాలలో భాగం, ప్రజా రవాణాను ప్రయాణికులకు మరింత అందుబాటులోకి , యూజర్ ఫ్రెండ్లీగా చేస్తుంది. ప్రయాణీకులకు అందించబడిన వినియోగంపై వివరణాత్మక సూచనలతో, కొత్త చెల్లింపు ఎంపిక త్వరలో అందుబాటులోకి రానుంది







అభివృద్ధి దిశగా

# 100 రోజుల పరుగు

- ఏపిలో ఎన్‌డిఏ సర్కారు సాధించిందేంటి?
- అభివృద్ధి.. సంక్షేమం కార్యక్రమాల మధ్య సమతూకం

ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయాన్ని సొంతం చేసుకుని అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పాలనకు నేటితో వంద రోజులు పూర్తి అయ్యాయి. ఈ వంద రోజుల పాలనలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కొటిగా నెరవేర్చేందుకు కృషి చేసింది సర్కార్. ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ఈ కొద్దిరోజుల్లోనే ప్రభుత్వం చేపట్టింది. అభివృద్ధి.. సంక్షేమం కార్యక్రమాల మధ్య సమతూకం పాటిస్తూ సర్కార్ దూసుకెళ్తోంది. నిత్యం పరదాల మాటున కాకుండా ప్రజల్లోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ఉన్నారు. మరిన్ని వివరాలలోకి వెళితే....

చంద్రబాబు 4.0 పాలన ఎలాంటి ఆర్భాటాలు లేకుండా 100 రోజులు పూర్తయింది. అపోజిషన్‌లో ఉన్నప్పుడు పవర్‌లోకి వస్తే ఏం చేస్తామో చెప్పిన చంద్రబాబు.. చెప్పిట్లుగానే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మరి ఈ వందరోజుల కూటమి సర్కార్ పనితీరు ఎలా ఉంది ? ఇన్ని రోజుల్లో సాధించిందేంటి ? భారీ మెజార్టీ ఇచ్చిన జనం ఆకాంక్షలు నెరవేర్చే దిశగానే వెళ్తుందా? ఎన్నో ఆశయాలతో ప్రజలు కట్టబెట్టిన అధికారం.. ప్రజల్లో భరోసా కల్పించి ఏర్పడిన ప్రభుత్వం.. సవాళ్లు.. ప్రతి సవాళ్ల మధ్య చేపట్టిన బాధ్యతలు.. ఇచ్చిన హామీలను అమలు చేయాలనే లక్ష్యం.. సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్ .. మూడు పార్టీల కలయిక శాశ్వతంగా ఉండాలని ఆకాంక్ష.. ఇలా చంద్రబాబు 4.0 పాలన ఎలాంటి ఆర్భాటాలు లేకుండా 100 రోజులు అయింది. రేపటితో వందరోజులు పూర్తికానుంది. అపోజిషన్‌లో ఉన్నప్పుడు పవర్‌లోకి వస్తే ఏం చేస్తామో చెప్పిన చంద్రబాబు.. చెప్పిట్లుగానే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మరి ఈ వందరోజుల కూటమి సర్కార్ పనితీరు ఎలా ఉంది ? ఇన్ని రోజుల్లో సాధించిందేంటి ? భారీ మెజార్టీ ఇచ్చిన జనం ఆకాంక్షలు నెరవేర్చే దిశగానే వెళ్తుందా

## తొలి వంద రోజుల్లోనే..

కాగా.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల వ్యవధిలోనే కూటమి సర్కార్ రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు సాధించడం ద్వారా రాజధాని వంటి కొన్ని కీలక కార్యక్రమాలు పూర్తి కాగలవన్న నమ్మకాన్నికలిగించగలిగింది. అగాథంలో కూరుకుపోయిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నిలబెట్టే ప్రయత్నం చేస్తూనే, సామాన్యులు, బాధితులకు ఉన్నంతలో ఉపశమనం కలిగించడానికి చంద్రబాబు ప్రభుత్వం తొలి వంద రోజుల్లో గట్టి ప్రయత్నం చేసింది.తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం మొదటి నెలలోనే పేదల ఫించన్‌ను ఒకేసారి రూ.వెయ్యి పెంచి రూ. నాలుగు వేలు చేశారు. అంతేకాకుండా మూడు నెలల బకాయి కలిపి ఒకేసారి రూ. ఏడు వేలు అందజేసింది.

## ఎలాంటి వివాదాల్లేకుండా



ఏవో హామీలిచ్చాం.. అధికారంలోకి వచ్చాం.. అని లైట్ తీసుకోలేదు. ఇచ్చిన హామీలను అమలు చేయాలనే లక్ష్యం. ఇవే ప్రధాన అంశాలుగా సీఎం చంద్రబాబు 100 రోజుల పాలన కొనసాగింది. అంతర్గతంగా ఎలాంటి వివాదాల్లేకుండా 100 రోజుల కూటమి పాలన సాగింది. పాలనలో పార్టీ పరమైన జోక్యం కనిపించలేదు. మూడు పార్టీల సమన్వయంతో పాలన సాగించారు. మొదటి నెలలోనే కీలక నిర్ణయాలు తీసుకుంటూ.. సంక్షేమ ఫలాలు అందిస్తూనే అభివృద్ధివైపు అడుగులు వేశారు చంద్రబాబు. ఇప్పటికే తన అనుభవంతో ప్రభుత్వ వ్యవస్థల్లో మార్పు తెస్తూ ప్రజలకు నమ్మకం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్ పేరుతో పబ్లిక్‌ను అట్రాక్ట్ చేస్తున్నారు. ఇక ఈ మూడు పార్టీల కలయిక శాశ్వతంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. అభివృద్ధితో పాటు మన నడవడిక ఆమోదయోగ్యంగా ఉండాల న్నారు. భవిష్యత్‌లో చేసేవి కూడా మనం చెప్పాలంటూ చంద్ర బాబు పేర్కొన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని.. ఇసుక విషయంలో మూడు పార్టీల నేతల జోక్యం వద్దంటూ సూచించారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడవద్దని.. తప్పులు చేసిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామంటూ పేర్కొన్నారు.

## మొదటి తేదీన జీతాలు పించన్లు

వైసీపీ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులు మొదటి తేదీన జీతాలు తీసుకోవడం అనేది అసాధ్యమే.. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక..




ప్రభుత్వ ఉద్యోగులకు కూడా చాలాకాలం తర్వాత మొదటి తేదీనే జీతాలు అందడం మొదలైంది. అధికారంలోకి వచ్చిన రెండో నెలలో కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునర్ ప్రారంభించి పేదవాడి ఆకలిని తీర్చింది. అంతకంటే ముఖ్యంగా ఇటీవల విజయవాడను భారీ వరదలు ముంచెత్తాయి. వరద సమయంలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించిన తీరు ఎంతో గొప్పదని చెప్పుకొవచ్చు. ఒక సామాన్యుడి లాగే సీఎం చంద్రబాబు వరద ముంపు ప్రాంతాల్లో తిరుగుతూ సహాయక చర్యలను పర్యవేక్షించారు. వరదల్లో సర్వం తానై పనిచేశారు. పది రోజుల పాటు బస్సులోనే ఉంటూ వరద బాధితులకు నేనున్నాంటూ భరోసా కల్పిస్తూ ప్రజల మన్ననలు పొందారు సీఎం చంద్రబాబు.

## ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు

ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసి ప్రజల ఆస్తులకు చంద్రబాబు రక్షణ కల్పించారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామిక పార్కులను కేంద్రం ఆమోదించేలా ఆయన చొరవ చూపారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలోని 7 వెనుకబడిన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయించగా, ప్రకాశం జిల్లాను ఈ జాబితాలో చేర్పించారు. విశాఖ రైల్వే జోన్కు 52 ఎకరాలు పూర్తి హక్కులతో కేటాయింపులు చేశారు. పంచాయతీలకు రూ.1452 కోట్లు, రైతులకు ధాన్యం బకాయిలు రూ.1674 కోట్లు విడుదల చేశారు. ఆరోగ్యశ్రీకి జగన్ రూ.1600 కోట్లు బకాయిలు పెట్టగా ఇప్పటి వరకు రూ.700 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. నీరు-చెట్టు బకాయిలు రూ.256 కోట్లు, రాజధాని కౌలు రైతుల బకాయిలు రూ.400 కోట్లు, పేదల గృహనిర్మాణ బకాయిలు రూ.50 కోట్లు చెల్లించారు. రేషన్ దుకాణాల్లో బియ్యంతోపాటు పంచదార, గోధుమపిండి ఇస్తున్నారు. కంది పప్పు ధర మార్కెట్‌లో రూ.180 ఉంటే దాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా రూ.150కి తగ్గించారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆన్లైన్ బుకింగ్ కోసం ప్రత్యేక పోర్టల్, యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. నూతన ఎక్సైజ్ విధానం ద్వారా మద్యం ధరలు తగ్గుదలకు నిర్ణయం తీసుకున్నారు. చేనేత వృత్తిదారులకు జీఎస్టీ ఎత్తివేత హామీ ఇచ్చారు. మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే 217 జీవోను రద్దు చేశారు. అర్చకుల వేతనాలు రూ.10,000ల నుంచి రూ.15,000లకు, నాయి బ్రాహ్మణుల వేతనాలు రూ.15,000ల నుంచి రూ.25,000లకు పెంచారు. ఉపాధి హామీ పథకం ద్వారా 6.50 కోట్ల పనిదినాలు పెంచడం వల్ల 54 లక్షల మందికి అదనంగా లబ్ధి చేకూరింది. ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు ఇస్తున్నారు.

## వరద సమయంలో పది రోజులు బస్సులోనే

విజయవాడ నగరం వరద ముంపునకు గురైనప్పుడు సీఎం చంద్రబాబు పది రోజుల పాటు బస్సులోనే ఉండి బాధితులకు సత్వర సహాయ చర్యలు చేపట్టడంతో పాటు రెట్టింపు సహాయాన్ని అందించారు. ఇటీవల వరద ముంపునకు గురైన బాధితులకు కూటమి ప్రభుత్వం ఎంతో అండగా నిలిచింది. మునుపెన్నడూ లేని విధంగా మెరుగైన ప్యాకేజీని ముఖ్యమంత్రి ప్రకటించారు. అచ్చుతాపురం ఫార్మా ప్రమాద మృతులు 17 మందికి ఒక్కొక్కరికి కోటి చొప్పున రూ.17 కోట్లు, తీవ్రంగా గాయపడ్డ 36 మందికి ఒక్కొక్కరికి రూ.50 లక్షలు, గాయపడ్డ 10 మందికి ఒక్కొక్కరికి రూ.25 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. తుంగభద్రలో కొట్టుకుపోయిన గేటును వరద సమయంలోనే బిగించి రాయలసీమకు సాగు, తాగునీటికి రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం కీలక పాత్ర పోషించింది. బుడమేరు గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చించారు.

బీపీసీఎల్ కంపెనీ ఏపీలో రూ.70,000ల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు చొరవ చూపింది. పర్యటనల వేళ పరదాలు, ట్రాఫిక్ అంతరాయాలు, చెట్ల నరికివేతల్లాంటివి లేకుండా చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

## అన్న క్యాంటీన్లు పునరుద్ధరణ



పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా 100పైగా అన్న క్యాంటీన్లను పునరుద్ధరించారు. ఆగస్టు 15న తొలిదశ కింద లాంఛనంగా వీటిని ప్రారంభించి, మలిదశలో మరో 75 క్యాంటీన్లు అందుబాటులోకి తెచ్చారు. రూ.15,000ల కోట్లు రాజధాని నిర్మాణానికి రుణం వచ్చేలా, పోలవరం ప్రాజెక్టు మొదటి దశ పూర్తి కావడానికి రూ.12,000ల కోట్లు ఇవ్వడానికి కేంద్ర కేబినెట్ అంగీకరించేలా కృషి చేశారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది.

## పట్టాదారు పాస్ పుస్తకాలపై రాజముద్ర

గత సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలపై 7 శ్వేతపత్రాలు విడుదల చేయడంతో పాటు మైనింగ్, ఎక్సైజ్ ఉన్నతాధికారుల సస్పెన్షన్ల వంటి కఠిన చర్యలు తీసుకున్నారు. విభజన సమస్యలపై ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల భేటీ సహృద్భావ వాతావరణంలో సాగింది. రాజధాని రైతులకు ఐదేళ్లపాటు కౌలు పొడిగించారు. పట్టాదారు పాస్ పుస్తకాలను రాజముద్రతో ఇచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అప్పటి ప్రభుత్వం చేపట్టిన అడ్డగోలు భూముల రీ సర్వేను నిలిపివేశారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు గ్రామసభలు

రాష్ట్రవ్యాప్తంగా రహదారుల మరమ్మతులకు రూ.290 కోట్లు, వరదలతో దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకు రూ.186 కోట్లను రాష్ట్ర విపత్తు నివారణ నిధి నుంచి విడుదల చేశారు. విజయవాడలో హెల్త్ యూనివర్సిటీకి డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీగా పేరును పునరుద్ధరించారు. ఆగస్టు 23న స్వర్ణ గ్రామ పంచాయతీ పేరిట రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించారు. ప్రజావేదిక, ప్రజాదర్బార్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ 50,000లకు పైగా అర్జీలను స్వీకరించారు.

## "ఇది మంచి ప్రభుత్వం"

100 రోజుల పాలనకు గుర్తుగా శుక్రవారం నుంచి ఈ నెల 26వతేది దాకా "ఇది మంచి ప్రభుత్వం" పేరుతో ప్రజల్లోకి ప్రజాప్రతినిధులు వెళ్లనున్నారు. ప్రకాశం జిల్లా చదలవాడ గ్రామంలో జరిగే "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రజల వద్దకు జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులు వెళ్లనున్నారు. ఈ నెల 26 వరకు పాల్గొనేలా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి నేటి నుంచి శ్రీకారం చుట్టనున్నారు. గ్రామ, వార్డు సభలు నిర్వహించి వంద రోజుల పాలనపై అవగాహన కలించేలా విస్తృత కార్యక్రమాలు నిర్వహించేలా కూటమి సర్కార్ ప్రణాళికులు రూపొందించింది.

విద్య వెంకట్, తెలంగాణ బ్యూరో 9391618181





# శతకంతో అశ్విన్ అరుదైన ఘనత.. కపిల్, ధోనీ రికార్డ్ సమం

● బంగ్లాపై అద్భుతమైన శతకంతో రాణించిన రవిచంద్రన్ అశ్విన్

ఏడు లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి అత్యధిక సెంచరీలు కొట్టిన కపిల్, ధోనీ సరసన అశ్విన్ ఈ ముగ్గురూ కూడా ఏడేసి శతకాలు కొట్టిన వైనం టీమిండియా ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ చెన్నై వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో మొదటి రోజు అజేయ శతకంతో మెరిశాడు. ఇది అశ్విన్‌కు టెస్టుల్లో ఏడో సెంచరీ. తద్వారా అతడు అరుదైన ఘనత సాధించాడు. స్వదేశంలో ఏడు లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి అత్యధిక సెంచరీలు చేసిన భారత మాజీ క్రికెటర్లు కపిల్ దేవ్, మహేంద్ర సింగ్ ధోనీ సరసన చేరాడు. వీరిద్దరూ కూడా ఏడు శతకాలే చేశారు. ఇప్పుడు అశ్విన్ కూడా ఏడో సెంచరీ చేయడంతో కపిల్, ధోనీ రికార్డు సమం అయింది. ఇక 144 పరుగులకే కీలకమైన 6 వికెట్లు కోల్పోయి భారత జట్టు పీకలలోతు కష్టాల్లో ఉన్న సమయంలో అశ్విన్, జడేజా ద్వయం ఆదుకుంది. అశ్విన్ అజేయ శతకం (112 బంతుల్లో 102 పరుగులు)తో రాణిస్తే, జడ్డూ (86 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ జోడి అజేయంగా 195 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడం విశేషం. దీంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 339/6 వద్ద నిలిచింది. ఇక అశ్విన్ గురువారం చెపాక్ స్టేడియంలో చేసిన టెస్టు సెంచరీ వరుసగా రెండోది. ఇంతకుముందు 2021లో ఇదే మైదానంలో ఇంగ్లండ్‌పై అతడు 148 బంతుల్లో 106 పరుగులు చేశాడు. అలాగే 2011, 2013లో ముంబయి, కోల్‌కతాలో వెస్టిండీస్‌పై కూడా అశ్విన్ వరుస టెస్టు శతకాలు బాదాడు.



# నిప్పులు చెరిగిన బుమ్రా

## కుప్పకూలిన బంగ్లాదేశ్

బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా(4/50) నిప్పులు చెరిగాడు. దాంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ బ్యాటర్లలో షకీబ్ అల్ హసన్(64 బంతుల్లో 5 ఫోర్లతో 32), మెహ్‌దీ హసన్ మీరాజ్(52 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 27 నాటౌట్) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో బుమ్రాతో పాటు మహమ్మద్ సిరాజ్(2/30), ఆకాశ్ దీప్(2/19), రవీంద్ర జడేజా(2/19) రెండేసి వికెట్లు తీసారు. ఫలితంగా భారత్‌కు 227 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. కెప్టెన్ రోహిత్ శర్మ (5) మరోసారి దారుణంగా విఫలమయ్యాడు. టాస్కిన్ అహ్మద్ బౌలింగ్‌లో క్యాచ్ ఔటయ్యాడు. ప్రస్తుతం క్రీజులో యశస్వి జైస్వాల్(10 బ్యాటింగ్), శుభ్‌మన్ గిల్(8 బ్యాటింగ్) ఉన్నారు. అంతకుముందు 339/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోర్‌కు 37 పరుగులు మాత్రమే జోడించింది. సెంచరీ హీరో అశ్విన్ ఏడు పరుగులే చేయగా.. జడేజా ఒక్క పరుగు కూడా జోడించలేదు. ఆకాశ్ దీప్(17) పరుగులు చేయగా.. బుమ్రా(7) నిరాశపరిచాడు. సిరాజ్(0) నాటౌట్‌గా నిలిచాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహముద్(5/83) ఐదు వికెట్లు తీయగా.. టాస్కిన్ అహ్మద్(3/55) మూడు వికెట్లు పడగొట్టాడు. నహిద్ రాణా, మెహ్‌దీ హసన్ మీరాజ్ తలో వికెట్ తీసారు. స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అరుదైన ఘనత సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 400 వికెట్ల మార్క్‌ను అందుకున్నాడు. ఈ ఘనత సాధించిన భారత ఆరో ఫాస్ట్ బౌలర్‌గా బుమ్రా చరిత్రకెక్కాడు. ఇక ఓవరాల్‌గా అంతర్జాతీయ క్రికెట్‌లో కనీసం 400 వికెట్లు తీసిన ఫాస్ట్ బౌలర్ల జాబితాలో అత్యల్ప సగటును కలిగిన రెండో ప్లేయర్‌గా రికార్డులకెక్కాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో బుమ్రా 21.01 సగటుతో 400 వికెట్లు పడగొట్టాడు. అగ్రస్థానంలో వెస్టిండీస్ పేసర్ జోయెల్ గార్నెర్ ఉన్నాడు. అతను 20.20 సగటుతో వికెట్లు పడగొట్టాడు. ఇక 30 ఏళ్ల బుమ్రా టెస్టుల్లో 170 వికెట్లు, వన్డేల్లో 149, టీ20 ఫార్మాట్‌లో 89 వికెట్లు తీశాడు. భారత్‌లో ఆడిన తొమ్మిది టెస్టుల్లో బుమ్రా 15.94 సగటుతో ఏకంగా 37 వికెట్లు సాధించాడు.

**రెండో రోజే 17 వికెట్లు...** బుమ్రా కంటే ముందు 400 వికెట్ల ఘనతను భారత్ తరఫున తొమ్మిది బౌలర్లు అందుకున్నారు. అనిల్ కుంబ్లే (953 వికెట్లు, 499 ఇన్నింగ్స్‌ల్లో), రవిచంద్రన్ అశ్విన్ (744 వికెట్లు, 369 ఇన్నింగ్స్‌ల్లో), హర్భజన్ సింగ్ (707 వికెట్లు, 442 ఇన్నింగ్స్‌ల్లో), కపిల్ దేవ్ (687 వికెట్లు, 448 ఇన్నింగ్స్‌ల్లో), జహీర్ ఖాన్ (597 వికెట్లు, 373 ఇన్నింగ్స్‌ల్లో), రవీంద్ర జడేజా (570 వికెట్లు, 397 ఇన్నింగ్స్‌ల్లో), శ్రీనాథ్ (551 వికెట్లు, 348 ఇన్నింగ్స్‌ల్లో), మహ్మద్ షమి (448 వికెట్లు, 245 ఇన్నింగ్స్‌ల్లో), ఇషాంత్ శర్మ (434 వికెట్లు, 280 ఇన్నింగ్స్‌ల్లో), బుమ్రా (401 వికెట్లు, 227 ఇన్నింగ్స్‌ల్లో) ఈ ఘనత సాధించారు. కాగా, బుమ్రా ధాటికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 149 పరుగులకే కుప్పకూలింది. షకిబ్ అల్ హసన్ (32బీ 64 బంతుల్లో, 5 ఫోర్లు) టాప్ స్కోరర్. మెహది హసన్ మిరాజ్ (27బీ 52 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్సర్), నజ్ముల్ హొస్సేన్ షాంటో (20బీ 30 బంతుల్లో, 3 ఫోర్లు) పరుగులు చేశారు. బుమ్రా నాలుగు వికెట్లు, ఆకాశ్ దీప్, సిరాజ్, జడేజా చెరో రెండు వికెట్లు తీశారు.





# అజయ్ రికార్డు స్వర్ణం

● కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్

సువా (ఫిజి): కామన్వెల్త్ చాంపియన్‌షిప్సులో భారత టీనేజ్ వెయిట్ లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు రికార్డు స్థాయి ప్రదర్శనతో పసిడి పతకం సొంతం చేసుకొన్నాడు. గురువారం జరిగిన జూనియర్ 81 కిలోల విభాగంలో 19 ఏళ్ల బాబు మొత్తం 326 (147o179) కిలోల బరువు ఎత్తి టాప్‌లో నిలిచాడు. ఈ క్రమంలో జూనియర్ కేటగిరీలో క్లీన్ అండ్ జెర్క్‌లో చాంపియన్‌షిప్ రికార్డును నెలకొల్పాడు. అంతేకాకుండా స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్‌తోపాటు మొత్తం ఎత్తిన బరువులోనూ జాతీయ జూనియర్ రికార్డును బద్దలుకొట్టాడు. కాగా విజయనగరం జిల్లాకు చెందిన అజయ్‌బాబు మధ్యప్రదేశ్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు.

# గిల్మోర్‌కు మాళవిక షాక్

● చైనా ఓపెన్ బ్యాడ్మింటన్



చాంగ్జౌ (చైనా): భారత షట్లర్ మాళవిక బన్సోడ్ చైనా ఓపెన్‌లో సంచలన ప్రదర్శన కొనసాగిస్తోంది. పారి స్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, వరల్డ్ నెంబర్ 7 గ్రెగోరియా (ఇండోనేసియా)కు తొలి రౌండ్‌లో షాకిచ్చిన 23 ఏళ్ల మాళ విక..ఈసారి క్రిస్టీ గిల్మోర్‌ను కంగు తినిపించింది. ప్రీక్వార్టర్‌ఫైనల్లో బన్సోడ్ 21-17, 19-21, 21-16తో వరల్డ్ నెం.25, రెండుసార్లు కామన్వెల్త్ క్రీడల పతక విజేత గిల్మోర్ (స్కాట్లాండ్)పై విజయం సాధించింది.



టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో సెంచరీతో సత్తా చాటిన

# చరిత్ర సృష్టించిన అశ్విన్.. 36 ఏళ్ల రికార్డ్

అశ్విన్.. సుదీర్ఘ ఫార్మాట్‌లో 6వ శతకాన్ని అందుకున్నాడు. అంతేకాకుండా చెన్నై వేదికగా వరుసగా రెండో సెంచరీ నమోదు చేశాడు. ఇదే వేదికపై అశ్విన్ నాలుగు సార్లు ఐదు వికెట్ల ఘనతలను అందుకున్నాడు. ఈ క్రమంలోనే అతను 36 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. చెన్నై వేదికగా రెండు శతకాలతో పాటు అత్యధిక సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకున్న క్రికెటర్‌గా అశ్విన్ నిలిచాడు. ఈ క్రమంలో దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ రికార్డ్‌ను అశ్విన్ అధిగమించాడు.

రెండో రోజే 17 వికెట్లు.. భారీ ఆధిక్యం దిశగా భారత్ రెండో రోజే 17 వికెట్లు.. భారీ ఆధిక్యం దిశగా భారత్! 1988లో వెస్టిండీస్‌తో చెన్నై వేదికగా జరిగిన మ్యాచ్‌లో శతకం సాధించిన కపిల్ దేవ్.. ఈ వికెట్‌పై రెండు శతకాలతో పాటు రెండు సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకున్న బౌలర్‌గా రికార్డుకెక్కాడు. గత 36 ఏళ్లుగా ఈ రికార్డు చెక్కుచెదరకుండా ఉంది.

కానీ తాజాగా అశ్విన్ సెంచరీతో అధిగమించాడు. ఒకే వేదికగా మల్టిపుల్ ఐదు వికెట్ల ఘనతతో పాటు సెంచరీలు నమోదు చేసిన నాలుగో క్రికెటర్‌గా అశ్విన్ నిలిచాడు. ఈ జాబితాలో కపిల్ దేవ్, ఇయామ్ బోతమ్, క్రిస్ కైర్న్స్, గారీ సోబెర్స్ ఉన్నారు.

**కపిల్ దేవ్‌-చెన్నై(2 శతకాలు, రెండు సార్లు ఐదు వికెట్ల ఘనత)...**

నిప్పులు చెరిగిన బుమ్రా.. కుప్పకూలిన బంగ్లాదేశ్ నిప్పులు చెరిగిన బుమ్రా.. కుప్పకూలిన బంగ్లాదేశ్! ఇయాన్ బోతమ్-లీడ్స్(2 శతకాలు, మూడు సార్లు ఐదు వికెట్ల ఘనత) క్రిస్ కైర్న్స్-ఆక్లాండ్(2 శతకాలు, రెండు సార్లు ఐదు వికెట్ల ఘనత)

**గారీ సోబెర్స్-లీడ్స్(2 శతకాలు, రెండు సార్లు ఐదు వికెట్ల ఘనత)...**

ఆ ఫేక్ ప్రచారానికి బదులుగా కోహ్లీ నామస్మరణతో దద్దరిల్లిన స్టేడియం..! ఆ ఫేక్ ప్రచారానికి బదులుగా కోహ్లీ నామస్మరణతో దద్దరిల్లిన స్టేడియం..!

**అశ్విన్‌-చెన్నై(2 శతకాలు, నాలుగు సార్లు ఐదు వికెట్ల ఘనత)...**

**తొలి ప్లేయర్‌గా అశ్విన్‌ రికార్డ్:** క్రికెట్ చరిత్రలోనే 20 సార్లు 50 కంటే ఎక్కువ పరుగులు, 30 సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకున్న తొలి ప్లేయర్‌గా అశ్విన్ నిలిచాడు.

# మొదలైన ద్రవిడ్ వ్యూహాలు

● రాజస్థాన్‌లో మరో ప్రపంచ కప్ విజేత



ఐపీఎల్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన టీమిండియా మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ తన వ్యూహాలు మొదలుపెట్టాడు. రాజస్థాన్ రాయల్స్‌ను బలోపేతం చేయడానికి చర్యలు వేగవంతం చేశాడు. భారత్ టీ20 వరల్డ్ కప్ గెలవడంలో తనతో పాటు కీలక పాత్ర పోషించిన మాజీ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్‌ను రాజస్థాన్ ఫ్రాంచైజీలోకి ఆహ్వానించాడు. ద్రవిడ్ సూచన మేరకు విక్రమ్ రాథోడ్‌ను బ్యాటింగ్ కోచ్‌గా రాజస్థాన్ రాయల్స్ నియమించింది. ఈ విషయాన్ని రాజస్థాన్ రాయల్స్ సోషల్ మీడియా వేదికగా శుక్రవారం ప్రకటించింది. రాజస్థాన్ రాయల్స్‌కు విక్రమ్ రాథోడ్ వస్తున్నాడని వెల్లడించింది. కొత్త బాధ్యతలపై విక్రమ్ స్పందించాడు. రాయల్స్ ఫ్యామిలీలో భాగమవ్వడం సంతోషంగా ఉందని తెలిపాడు. ద్రవిడ్‌తో కలిసి మళ్లీ పనిచేయడం, యువ క్రికెటర్లతో ముందకు వెళ్లడం ఉత్తేజకరంగా ఉందని అన్నాడు. టీమ్ విజన్‌ను మరింత ముందుకు తీసుకెళ్తానని, టాప్ క్లాస్ ప్లేయర్లను రాజస్థాన్ రాయల్స్‌కు, భారత్‌కు అందిస్తూ ఛాంపియన్స్‌గా నిలవడమే తమ లక్ష్యమని విక్రమ్ పేర్కొన్నాడు. టీ20 వరల్డ్ కప్ విజేత టీమిండియాకు విక్రమ్ రాథోడ్ బ్యాటింగ్ కోచ్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే. 2012లో విక్రమ్ జాతీయ సెలక్టర్‌గానూ సేవలు అందించాడు. అంతర్జాతీయ క్రికెట్ అనుభవం తక్కువగా ఉన్నప్పటికీ పరిస్థితులకు తగ్గట్లుగా ఆడేలా బ్యాటర్లను సిద్ధం చేయడంలో విక్రమ్ రాథోడ్ సిద్ధహస్తుడు. అందుకే విక్రమ్‌ను ద్రవిడ్ తన సహాయక బృందంలో చేర్చుకున్నట్లు తెలుస్తోంది. భారత్ తరఫున విక్రమ్ ఆరు టెస్టులు ఆడాడు. గతంలో తాను కోచ్‌గా పనిచేసిన రాజస్థాన్ రాయల్స్‌కు హెడ్ కోచ్‌గా ద్రవిడ్ మరోసారి బాధ్యతలు అందుకున్న విషయం తెలిసిందే. టీ20 వరల్డ్ కప్ ముగిసిన అనంతరం భారత జట్టు కోచ్ పదవి నుంచి తప్పుకున్నద్రవిడ్ రాజస్థాన్ కోచ్‌గా తన యాక్షన్ మొదలుపెట్టాడు. 2011 నుంచి 2015 మధ్య రాజస్థాన్‌కు కెప్టెన్‌గా, కోచ్‌గా ద్రవిడ్ వ్యవహరించాడు. 2013లో ఆటకు గుడ్‌బై చెప్పి 2014 నుంచి పూర్తిగా కోచింగ్ బాధ్యతలు చూసుకు న్నాడు. కాగా, గత సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించినప్పటికీ ఫైనల్స్‌కు క్వాలిఫై కాలేకపోయింది.

# రికీ, భరత్ అర్ధ శతకాలు

● ఇండియా-డి 306/5

● ఇండియా-బితో దులీప్ ట్రోఫీ మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి) : కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (0) మరోసారి డకౌటైనా.. సంజూ శాంసన్ (89 బ్యాటింగ్)తోపాటు రికీ భుయ్ (56), కేఎస్ భరత్ (52) అర్ధ శతకాలతో చెలరేగడంతో ఇండియా-డి భారీ స్కోరు దిశగా సాగుతోంది. దులీప్ ట్రోఫీలో ఇండియా-బితో గురువారం ఆరంభమైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-డి 306/5 స్కోరు చేసింది. రావత్ అజేయ శతకం..: మరో మ్యాచ్‌లో శాశ్వత్ రావత్(122 బ్యాటింగ్) సెంచరీతో ఆదుకోవడంతో ఇండి యా-ఎ కోలుకొంది. ఇండియా-సితో ఆరంభమైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-ఎ 224/7 స్కోరు చేసింది. 36/5తో పీకల్లోతు కష్టాల్లోపడ్డ సమయంలో షామ్స్ ములాని (44)తో కలసి రావత్ వికెట్ల పతనాన్ని అడ్డు కొన్నారు. అయితే, ములానీని అవుట్ చేసిన గౌరవ్.. ఆరో వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు.

# రెండో రోజే 17 వికెట్లు



## భారీ ఆధిక్యం దిశగా భారత్

బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో భారత్ పట్టు బిగించింది. భారత బౌలర్లు నిప్పులు చెరగడంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే కుప్పకూలింది. అనంతరం 227 పరుగుల భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 23 ఓవర్లలో 3 వికెట్లకు 81 పరుగులు చేసింది.

యశస్వి జైస్వాల్(10), రోహిత్ శర్మ(5), విరాట్ కోహ్లీ(17) విఫలమైనా.. శుభ్‌మన్ గిల్(33 బ్యాటింగ్), రిషభ్ పంత్(12 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా రెండో రోజు ఆటను ముగించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో టాస్కిన్ అహ్మద్, నహిద్ రాణా, మెహ్‌దీ హసన్ మీరాజ్ తలో వికెట్ తీసారు. రెండో రోజు పూర్తిగా బౌలర్ల ఆధిపత్యం నడిచింది. మొత్తం 17 వికెట్లు పడ్డాయి. ప్రస్తుతం భారత్ ఆధిక్యం 308 పరుగులకు చేరింది.

**భారత్ 376 ఆలౌట్..** అంతకుముందు 339/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోర్‌కు 37 పరుగులు మాత్రమే జోడించింది. తొలి సెషన్‌ను కూడా పూర్తిగా ఆడలేకపోయింది. సెంచరీ హీరో అశ్విన్ తన ఓవర్‌నైట్ స్కోర్‌కు ఏడు పరుగులే జోడించగా.. జడేజా ఒక్క పరుగు కూడా జోడించలేదు. ఆకాశ్ దీప్(17) పరుగులు చేయగా.. బుమ్రా(7) నిరాశపరిచాడు. సిరాజ్(0) నాటౌట్‌గా నిలిచాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహముద్(5/83) ఐదు వికెట్లు తీయగా.. టాస్కిన్ అహ్మద్(3/55) మూడు వికెట్లు పడగొట్టాడు. నహిద్ రాణా, మెహ్‌దీ హసన్ మీరాజ్ తలో వికెట్ తీసారు.

**నిప్పులు చెరిన భారత బౌలర్లు..** అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్‌కు భారత బౌలర్లు ఆదిలోనే గట్టి షాక్ ఇచ్చారు. బుమ్రా, ఆకాశ్ దీప్ నిప్పులు చెరగడంతో 9 ఓవర్లలోనే బంగ్లాదేశ్ మూడు వికెట్లు కోల్పోయింది. దాంతో బంగ్లాదేశ్ 26/3 లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. లిట్టన్ దాస్, షకీబ్ అల్ హసన్ పోరాడే ప్రయత్నం చేసినా.. అవకాశం ఇవ్వలేదు.

**నిప్పులు చెరిగిన బుమ్రా.. కుప్పకూలిన బంగ్లాదేశ్...** సిరాజ్, జడేజాతో పాటు బుమ్రా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో బంగ్లాదేశ్ 112/8 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. చివరి సెషన్ ప్రారంభమైన కాసేపటికే బంగ్లాదేశ్ చివరి రెండు వికెట్లు కోల్పోయి కుప్పకూలింది. భారత బౌలర్లలో బుమ్రా(4/50) నాలుగు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్(2/30), ఆకాశ్ దీప్(2/19), రవీంద్ర జడేజా(2/19) రెండేసి వికెట్లు పడగొట్టారు.

# మనోళ్లు 'టాప్'లోనే

● ఎనిమిదో రౌండ్‌లో పురుషులు గెలుపు

● మహిళలకు తొలి ఓటమి జూ చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: స్వర్ణ పతకమే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్ బరిలో దిగిన భారత పురుషులు, మహిళల జట్లు ఆ దిశగా దూసుకుపోతున్నాయి. పురుషులు (16 పాయింట్లు) అపజయమే లేకుండా ఎనిమిదో రౌండ్‌నూ ముగించారు. కాకపోతే..మహిళలకే టోర్నీలో తొలి ఓటమి ఎదురైంది. గురువారం జరిగిన ఈ రౌండ్‌లో రెండో సీడ్ పురుషుల జట్టు 3.5-0.5 స్కోరుతో ఇరాన్‌ను ఓడించింది. టాప్ సీడ్ మహిళల జట్టుకు పోలెండ్ 2.5-1.5తో షాకిచ్చింది. మహిళల జట్టు పోలెండ్, కజకిస్థాన్‌తో కలిసి 14 పాయింట్లతో నిలిచింది. కానీ మెరుగైన టైబ్రేకర్ స్కోరుతో మన మహిళలే టాప్‌లో కొనసాగుతున్నారు. పురుషుల విభాగంలో..నల్లపావులతో ఆడిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి 36 ఎత్తుల్లోనే దనేశ్వర్ బర్దియాను చిత్తు చేశాడు. గుకేష-మగ్‌సోద్లో పర్హమ్‌పై, విదిత్ గుజ్‌రాతీ-ఇదానీ పౌయా విజయం సాధించారు. అయితే తబతబేయా అమీన్‌తో జీఎం ప్రజ్ఞానంద పాయింటును పంచుకున్నాడు. మహిళల్లో..తొలి గేమ్‌లో సోకో మోనికపై వైశాలీ ఓడిపోయింది.

**ఛాతుల్ ఫాలో అవ్వండి.** దాంతో మనోళ్లు 0-1తో వెనుకంజలో నిలవగా..నల్లపావులతో ఆడిన దివ్య దేశ్‌ముఖ్-అలెక్సాండ్రాపై గెలవడంతో స్కోరు 1-1తో సమమైంది. తెలుగు జీఎం హారిక..కషిన్‌స్కయా చేతిలో ఓడడంతో పోలెండ్ మళ్లీ 2-1 ఆధిక్యం సాధించింది.. ఇక..నిర్ణాయక ఆఖరి గేమ్‌ను అలిక్జాతో వంతిక అగర్వాల్ డ్రా చేయడంతో పరాజయం తప్పలేదు.

పొరపాటున నో బాల్ పడితే

# యువీ 7 సిక్సర్లు కొట్టేవాడు




ఒకే ఓవర్‌లో యువరాజ్ సింగ్ బాదిన ఆరు సిక్సర్ల ఊచకోతకు గురువారంతో సరిగ్గా 17 ఏళ్లు. ఈ నేపథ్యంలో యువరాజ్ బ్యాటు వేటుకు బలి అయిన ఇంగ్లండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ స్పందించాడు. ట్రెంట్‌బ్రిడ్జ్ వేదికగా ఇంగ్లండ్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరిగిన తొలి వన్డేలో వ్యాఖ్యాతగా ఉన్న సమయంలో యువీ మిగిల్చిన పీడ కల గురించి మాట్లాడాడు. యువరాజ్ సింగ్ విధ్వంసానికి సంబంధించిన వీడియోను ఆ తర్వాత ఎన్నడూ చూడలేదని స్టువర్ట్ బ్రాడ్ తెలిపాడు. అయితే ఆ ఓవర్‌లో పొరపాటును నో బాల్ పడితే.. దాన్ని కూడా యువీ సిక్సర్‌గా మలిచేవాడని, అంతటి ఊపులో యువరాజ్ ఉన్నాడని అన్నాడు. అదృష్టవశాత్తు ఆ ఓవర్‌లో నో బాల్ వేయలేదని బ్రాడ్ పేర్కొన్నాడు. భారత్‌పై చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ కుర్రాడు! భారత్‌పై 2007 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్రాడ్ వేసిన 19వ ఓవర్‌లో యువరాజ్ అన్ని బంతుల్ని సిక్సర్లుగా మలిచిన సంగతి తెలిసిందే. ఈ అపూర్వ ఘట్టాన్ని భారత క్రికెట్ అభిమానులు అంత సులువుగా మరిచిపోలేదరు. 2007 సెప్టెంబర్ 19న ఈ విధ్వంసం జరిగింది. యువరాజ్‌ను లక్ష్యంగా చేసుకుని ఫ్లింటాఫ్ చేసిన కవ్వింపులు స్టువర్ట్ బ్రాడ్‌కు శాపంగా మారింది. చరిత్రకు నాంది పలికింది. టీ20ల్లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్స్‌లు కొట్టిన తొలి బ్యాటర్‌గా యువీ ఆ రోజు చరిత్ర సృష్టించాడు. అలాగే అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఆ మ్యాచ్‌లో 17వ ఓవర్లో యువరాజ్ క్రీజులోకి అడుగుపెట్టాడు. ఆ తర్వాత ఫ్లింటాఫ్ బౌలింగ్‌లో యువీ రెండు ఫోర్లు బాదాడు. అనంతరం యువీని ఫ్లింటాఫ్ కవ్వించాడు. దీంతో కోపంతో రగిలిపోయిన యువరాజ్ తర్వాతి ఓవర్‌లో పెను విధ్వంసం సృష్టించాడు. బ్రాడ్ వేసిన మొదటి బంతిని డీప్ వికెట్‌కు, లాంగాన్‌కు మధ్యగా సిక్సర్ బాదాడు. రెండో బంతిని ఫ్లిక్‌తో డీప్ మీదుగా స్టాండ్స్‌లో పడేశాడు. ఇక తర్వాత ఎక్స్‌ట్రా కవర్స్, బ్యాక్‌వర్డ్ పాయింట్, ఓవర్ మిడ్‌వికెట్ మీదుగా సిక్సర్ల వర్షం కురిపించాడు. ఆఖరి బంతిని వైడ్ మిడాన్ మీదుగా సిక్స్ కొట్టి యువీ చరిత్ర సృష్టించాడు.

సూర్య cinema@suryaa.com
హైదరాబాద్
శనివారం
21 సెప్టెంబర్ 2024


# సూర్య సినిమా

## హరి హర వీర మల్లు
### పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్



సినీ రంగంలో తిరుగులేని కథానాయకుడిగా పేరు సంపాదించుకున్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయ రంగ ప్రవేశం చేసి, అక్కడా గొప్ప నాయకుడిగా పేరు పొందారు. ప్రజాసేవకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న పవన్ కళ్యాణ్, 'హరి హర వీర మల్లు' చిత్రం యొక్క మిగిలిన షూటింగ్ ను పూర్తి చేయడానికి తగిన సమయం కేటాయించలేకపోయారు. సమాజ సేవ పట్ల పవన్ కళ్యాణ్ నిబద్ధ తను అర్థం చేసుకున్న చిత్ర నిర్మాతలు, ఆయన భాగంకాని ఇతర సన్నివేశాల చిత్రీకరణ మరియు చిత్రానికి సంబంధించిన ఇతర కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్, గతంలో తాను అంగీకరించిన చిత్రాలను పూర్తి చేయాల్సిన బాధ్యతపై కూడా తనపై ఉందని, వీలు చూసుకొని షూటింగ్ కోసం తగు సమయం కేటాయిస్తానని మాట ఇచ్చారు. తన మాటకు కట్టుబడి ఉన్న పవన్ కళ్యాణ్, హరి హర వీర మల్లు మొదటి భాగం యొక్క మిగిలిన షూటింగ్ ను పూర్తి చేయడానికి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆయనతో కలిసి చేయడానికి నటీనటులు, సాంకేతిక సిబ్బంది ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. వెండితెరపై ప్రేక్షకులకు మరపురాని అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో, నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 23వ తేదీ నుంచి విజయవాడలో 'హరి హర వీర మల్లు' కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. హాలీవుడ్ దిగ్గజ యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ ఆధ్వర్యంలో భారీ యుద్ధ సన్నివేశం చిత్రీకరించబోతున్నామని నిర్మాతలు తెలిపారు.



## 31 సిటీల్లో ఏఎన్ఆర్ 100 ఫిల్మ్ ఫెస్టివల్ సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందం -నాగార్జున


నటసామ్రాట్, పద్మవిభూషణ్ శ్రీ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా, ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ ఎన్ఎఫ్‌డిసి-నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియాతో కలిసి 'ఎఎన్ఆర్ 100 %-% కింగ్ ఆఫ్ ది సిల్వర్ స్క్రీన్' ఫిల్మ్ ఫెస్టివల్‌ని నిర్వహిస్తోంది. అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఏఎన్ఆర్ ఐకానిక్ ఫిలిం 'దేవదాసు' స్క్రీనింగ్ తో ఈ ఫెస్టివల్ గ్రాండ్ గా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నాన్నగారు నవ్వుతూ మాకు జీవితాన్ని నేర్పించారు. అందుకే ఆయన పేరు తలచుకుంటే నవ్వుతూనే వుంటాం. శివేంద్ర గారికి థాంక్. దేవదాస్ తో పాటు మరికొన్ని సినిమాలు చూడబోతున్నారు. వాళ్ళు చేసిన బ్లాక్ అండ్ వైట్ ప్రింట్స్ అద్భుతంగా వున్నాయి. ఆడియన్స్ కి వండర్ ఫుల్ ఎక్స్ పీరియన్స్ వుంటుంది. 31 సిటీల్లో ఈ ఫెస్టివల్ చేస్తున్నారు. నార్త్ లో ఫాంటాస్టిక్ రెస్పాన్స్ వస్తుందని శివేంద్ర చెప్పడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. గోవా ఇంటర్ నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ నాన్న పేరు మీద ఒక చాప్టర్ చేస్తున్నారు. ఈ విషయంలో చాలా హ్యాపీగా వుంది. పోస్ట్ మాస్టర్ జనరల్ బీఎస్ రెడ్డి కి థాంక్ యూ. ఈ శత జయంతి రోజున నాన్న గారి స్టాంప్ రిలీజ్ చేయడం చాలా అనందంగా వుంది. ఈ వేడుకకు వచ్చిన అందరికీ పేరుపేరునా థాంక్ యూ సో మచ్. శత జయంతిని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లో ని నాన్న గారి సీనియర్ అభిమానులు రక్తదానం, అన్నదానం లాంటి మంచి కార్యక్రమలు చేశారు. వారందరికీ థాంక్ యు వెరీ మచ్. మీ ప్రేమ అభిమానం మర్చిపోలేనేది. ప్రతి రెండేళ్ళకు ఏఎన్ఆర్ అవార్డ్ ఇస్తున్నాం. ఈ ఏడాది ఏఎన్ఆర్ అవార్డ్ చిరంజీవికి ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఈ విషయం చెప్పగానే చిరంజీవి గారు చాలా ఎమోషనల్ హాగ్ చేసుకొని ఏఎన్ఆర్ గారి శత జయంతి ఏడాదిలో ఇవ్వడం చాలా ఆనందంగా వుందని చెప్పారు. దీనికి కంటే పెద్ద అవార్డ్ లేదని అన్నారు. అమితాబ్ బచ్చన్ గారు అవార్డ్ ప్రధానం చేస్తారు. అక్టోబర్ 28 ఈ ఫంక్షన్ చేస్తున్నాం. అందరికీ ధన్యవాదాలు' తెలిపారు.

## నవంబర్ 14న 'కంగువ'

స్టార్ హీరో సూర్య నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'కంగువ' నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. అక్టోబర్ 10వ తేదీన రావాల్సిన 'కంగువ' మరిన్ని హంగులతో ముస్తాభై నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకురాబోతోంది. ఈ రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా విడుదల చేసిన వీడియో ఆకట్టుకుంటోంది. 'కంగువ' చిత్రాన్ని భారీ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ గా దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'కంగువ' సినిమాను హ్యూజ్ బడ్జెట్ తో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను నైజాం ఏరియాలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేయబోతున్నారు.



## సాయి దుర్గ తేజ్ యాక్షన్-ప్యాక్డ్ షెడ్యూల్ కంప్లీట్



మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ స్ట్రాంగ్ కంటెంట్ సబ్జెక్ట్‌లను ఎంచుకుంటూ వరుస సూపర్ హిట్స్ తో దూసుకుపోతున్నారు. 'విరూపాక్ష', 'బ్రో' బ్లాక్‌బస్టర్ విజయాల తర్వాత, రోహిత్ కెపి దర్శకుడిగా మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను చేస్తున్నారు. హనుమాన్ సెన్సేషనల్ పాన్ ఇండియా విజయం తర్వాత, నిర్మాతలు కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పై ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సాయిదుర్గతేజ్18వ చిత్రం టీం ప్రముఖ ఫైట్ మాస్టర్స్ కొరియోగ్రాఫ్ చేసిన 15 రోజుల యాక్షన్-ప్యాక్డ్ షెడ్యూల్ పూర్తి చేసింది. మునుపెన్నడూ చూడని యాక్షన్ సీక్వెన్స్ లలో సాయి దుర్గా తేజ్ పవర్ ఫుల్ మాస్ అవతార్‌లో కనిపిస్తారు, హై-ఆక్టేన్ స్టంట్స్, డైనమిక్ ఫైట్ సీన్స్ ప్రేక్షకులను థ్రిల్ చేయనున్నాయి. హై బడ్జెట్‌తో భారీ స్థాయిలో టాప్ ప్రొడక్షన్ వాల్యూస్ తో ఈ సినిమాని తెరకెక్కుతోంది. నెక్స్ట్ షెడ్యూల్ కోసం 12 ఎకరాల్లో మ్యాసీవ్ సెట్ సిద్ధమవుతోంది.

## "ఫియర్" టీజర్ రిలీజ్

హీరోయిన్ వేదిక లీడ్ రోల్ లో నటిస్తున్న సినిమా "ఫియర్". ఈ సినిమాను దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ప్రొడ్యూసర్ ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. సుజాతరెడ్డికో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్ కథతో దర్శకురాలు డా. హరిత గోగినేని ఫియర్ మూవీని రూపొందిస్తున్నారు. అరవింద్ కృష్ణ ఓ స్పెషల్ రోల్‌లో కనిపిం చనున్నారు.



"ఫియర్" సినిమా విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ప్రతిష్టా త్మక ఫిలిం ఫెస్టివల్స్‌లో 60కి పైగా అవార్డ్స్ లను గెల్చుకుని కొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. "ఫియర్" సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు సిద్ధమవుతోంది. "ఫియర్" సినిమా తెలుగు టీజర్ ను స్టార్ హీరో రానా, తమిళ టీజర్ ను విజయ్ సేతుపతి, కన్నడ టీజర్ ను కిచ్చా సుదీప్, మలయాళ టీజర్ ను దిలీప్, హిందీ టీజర్ ను ఇమ్రాన్ హాష్మీ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. అనంతరం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో "ఫియర్" టీజర్ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో అరవింద్ కృష్ణ మాట్లాడుతూ - "ఫియర్" సినిమా నాకు ఒక గొప్ప ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. ఈ సినిమాలో నటనకు నాకు రోమ్ ఫిలిం ఫెస్టివల్‌లో బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ అవార్డ్ దక్కింది. ఈ చిత్రంలో వేదిక గారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం హ్యాపీగా ఉంది.

## 'జనక అయితే గనక' లిరికల్ సాంగ్



వెర్సటైల్ యాక్టర్ సుహాస్, సంగీర్తన హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతా కంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్ రెడ్డి బండ్ల డైరక్ట్ చేశారు. ఈ సినిమా దసరా సంద ర్భంగా 'జనక అయితే గనక' అక్టోబర్ 12న విడుదల కానుంది. ఇప్పటి వరకు చిత్రం నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు, పాటలు, టీజర్‌లు ఇలా అన్నీ కూడా ఆడియె న్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. తాజాగా ఈ చిత్రం నుంచి ఓ మంచి వినోదాన్ని ఇచ్చే పాటను రిలీజ్ చేశారు. మిడిల్ క్లాస్ ఉద్యోగి, మేనేజర్‌తో పడే తంటాలు, చాలీచాలని జీతాలతో ఉండే ఉద్యోగి కష్టాల్ని ఎంతో ఫన్నీగా చూపించారు. 'ఏం పాపం చేశామో' అంటూ సాగే ఈ పాటను కృష్ణ కాంత్ రచించగా.. రితేష్ జి. రావు ఆలపించారు.

## 'మ్యాడ్ స్క్వేర్' నుంచి 'లడ్డు గాని పెళ్లి' గీతం




కళాశాల నేపథ్యంలో ముగ్గురు యువకులు చేసే అల్లరి ప్రధానంగా రూపొందిన వినోదాత్మక చిత్రం 'మ్యాడ్' ఎంతటి సంచలన విజయాన్ని సాధించిందో తెలిసిందే. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రానికి సీక్వెల్‌గా మ్యాడ్ మ్యాక్స్ ఎంటర్‌టైనర్ 'మ్యాడ్ స్క్వేర్'ను తీసుకురాబోతుంది. కేవలం ప్రకటన తోనే 'మ్యాడ్ స్క్వేర్'పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా యువత ఈ సినిమా కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో "లడ్డు గాని పెళ్లి" అనే బరాత్ గీతంతో ప్రచార కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించింది చిత్ర బృందం. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి మొదటి గీతంగా "లడ్డు గాని పెళ్లి"ని సెప్టెంబర్ 20న విడుదల చేశారు. 'మ్యాడ్' చిత్రంలో భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన "కళ్ళజోడు కాలేజీ పాప" అనే పాట యువతను విశేషంగా ఆకట్టుకొని చార్ట్ బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు 'మ్యాడ్ స్క్వేర్' కోసం ఆయన స్వరపరిచిన "లడ్డు గానీ పెళ్లి" గీతం అంతకుమించిన ఆదరణ పొందుతుంది అనడంలో సందేహం లేదు. తీన్మార్ బీట్ లతో థియేటర్లలో ప్రతి ఒక్కరూ కాలు కదిపేలా ఈ గీతం ఉంది.

## 'శారీ' ఫాన్సీ రేట్ తో తెలుగు రాష్ట్రాలకు పంపిణీ హక్కులు




రాం గోపాల్ వర్మ తాజా సినిమా 'శారీ' టైటిల్‌కి 'టూ మచ్ లవ్ కెన్ బి స్కేరీ' అనే లాగ్ లైన్‌తో పాన్ ఇండియా మూవీగా తెలుగు, హిందీ, తమిళ, మరియు మళయాళ భాషల్లో ఈ చిత్రాన్ని నవంబర్‌లో విడుదల చేయనున్నారు. గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో అర్జీవి ఆర్వి ప్రొడక్షన్స్ బ్యానర్ పై 'శారీ'ని ప్రముఖ బిజినెస్ మాన్ రవి వర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఆంధ్ర, తెలంగాణ రాష్టాలలో వెంకటసాయి ఫిలిమ్స్ ద్వారా తెలుగులో విడుదల చేయడానికి ప్రముఖ పంపిణీ దారుడు ముత్యాల రాందాస్ థియేట్రికల్ హక్కులు సొంతం చేసుకున్నారు. పలు నిజజీవిత సంఘటనల మేళవింపుతో ఓ సైకలాజికల్ థ్రిల్లర్‌గా 'శారీ' చిత్రం రూపొందుతోంది. చీరలో ఉన్న అమ్మాయిని చూసి పిచ్చివాడై ఆమెతో ప్రేమలోపడి ఎంతో హానికరంగా, డేంజరస్‌గా... ఓ అబ్బాయి జీవితం ఎలా భయానకంగా మారింది అన్నదే ఇందులోని ప్రధానాంశం. ఇందులో అబ్బాయిగా సత్య యాదు నటిస్తూండగా, అతనిలో సెగలు రేపే చీరలోని అమ్మాయి పాత్రలో ఆరాధ్య దేవి నటిస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత రవి వర్మ మాట్లాడుతూ : 'శారీ' మూవీని తెలుగు, హిందీ, తమిళ, మరియు మళయాళ భాషల్లో ఈ చిత్రాన్ని నవంబర్ లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాము.

## ఓటీటీల్లో మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటున్న "కన్యక"



ప్రముఖ ఓటీటీల్లో స్ట్రీమింగ్ అవుతూ మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది "కన్యక" మూవీ. ఈ చిత్రాన్ని బి సినీ ఈటి సమర్పణలో శ్రీ కాశీ విశ్వనాథ్ పిక్చర్స్ బ్యానర్స్‌పై కేవీ అమరలింగేశ్వరరావు, ఆతుకూరి సాంబశివ రావు, కూరపాటి పూర్ణచంద్ర రావు నిర్మించారు. ఈ సినిమా ప్రస్తుతం ఎయిర్ టెల్ ఎక్స్ ట్రీమ్, హంగామా, టాటా ప్లే బింగే, వాచో, వి మూవీస్ టీవీ ఇంకా ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్స్ లో స్ట్రీమింగ్ అవుతోంది. విశ్వనాథ శాస్త్రి అనే ఒక బ్రాహ్మణోత్తముని కూతురు కన్యక కనిపించకుండా పోతుంది ఆ అమ్మాయి లేచి పోయిందా లేదా ఎవరైనా చంపేశారా అని శ్రావ్య అనే అమ్మాయి ఆ ఊరి కొచ్చి విశ్వనాథ శాస్త్రి గారి ఇంటిలోని ఉంటూ ఇన్విస్టి గేట్ చేస్తుంది...కన్యక ఏమైంది వచ్చిన అమ్మాయి ఎవరు చివరి వరకు అసలు ఏం జరిగింది అని సస్పెన్స్ కథాంశంతో, మనం చేసిన తప్పులను ఒక కన్ను గమనిస్తుంది అని మెసేజ్‌తో ఈ సినిమా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ఓటీటీలో కన్యక కు వస్తున్న రెస్పాన్స్ పట్ల దర్శక నిర్మాతలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. నిర్మాతలు కేవీ అమరలింగేశ్వరరావు, ఆతుకూరి సాంబశివరావు, కూరపాటి పూర్ణచంద్ర రావు మాట్లాడుతూ - మా కన్యక సినిమాకు అన్ని ప్రముఖ ఓటీటీల్లో మంచి రెస్పాన్స్ వస్తోంది. మా మొదటి సినిమానే ఒక మంచి మెసేజ్ ఓరియంటెడ్ సినిమా చేసినందుకు ఆనందంగా ఉంది.

## "ధూం ధాం" స్పెషల్ గ్లింప్స్



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "ధూం ధాం". సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. "ధూం ధాం" సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందిస్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. అక్టోబర్ లో ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. తెలుగు నట దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఆయనకు ట్రిబ్యూట్ గా "ధూం ధాం" సినిమా నుంచి స్పెషల్ వీడియో రిలీజ్ చేశారు. ఏఎన్నార్ క్లాసిక్ మూవీ ప్రేమ్ నగర్ లోని మనసు గతి ఇంతే పాటను వెన్నెల కిషోర్ పాడుతున్న వీడియో ఆకట్టుకుంటోంది. "ధూం ధాం" సినిమా నుంచి ఇప్పటిదాకా రిలీజ్ చేసిన కంటెంట్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.